# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 18-10-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:67 పేజీలు:6 వెల: రూ.1/-


## నేటి కందం-నేటికి అందం

నీరాజనములతో పెం
పారుచునున్నట్టి విజయవాటిక లోనన్
సారస్ పేరున మేళా
ప్రారంభించినది రాష్ట్రపతి ముర్మూజీ !!

(మొట్టమొదటి సారి ఢిల్లీలో కాకుండా విజయవాడలో సారస్ మేళాను రాష్ట్రపతి ముర్మూజీ ప్రారంభించారు. దీని వలన దేశంలోని మిగతా ప్రాంతాలకు కూడా గ్రామీణ మహిళల ప్రతిభకు పట్టం కట్టే అవకాశం లభించిందని అందరూ ప్రశంసిస్తున్నారు.)



-రాధశ్రీ
సెల్:9494481210

## చురక

ఆలపిస్తూ పాటలు
ఆడేవాళ్లు కరువు
ఆధునిక బతుకమ్మ
ఆత్మ ఎండు చెరువు.
అరచేతుల చప్పట్లు
అన్నీ మింగే డీజేలు
స్టెప్పుడాన్సు ఆటలు
చెప్పుతుండే జేజేలు



-వేల్పుల నారాయణ
9440433475

# పులివెందులలో హై టెన్షన్..
## గాల్లోకి 6 రౌండ్ల కాల్పులు జరిపిన పోలీసులు

కడప జిల్లా, స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కడప జిల్లాలోని పులివెందులలో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు చోటుచేసుకున్నాయి. నామినేషన్ కేంద్రం దగ్గర కూటమి, వైసీపీ శ్రేణుల మధ్య ఘర్షణ చెలరేగింది. ఇరువర్గాలూ నామినేషన్ కేంద్రం దగ్గరకు దూసుకొచ్చాయి. రెండూ వర్గాలూ రాళ్లతో దాడులు చేసుకున్నాయి. ఈ క్రమంలో వైసీపీ శ్రేణులు ఒక్కసారిగా పోలీసుల పైకి దూసుకురావడంతో.. వారిని అదుపు చేసేందుకు పోలీసులు గాల్లోకి 6 రౌండ్ల కాల్పులు జరిపారు. లాఠీచార్జ్ చేసి ఆందోళనకారులను చెదరగొట్టారు.

అలాగే, పోలీసులు టియర్ గ్యాస్‌ను ప్రయోగించారు. ఇరు పార్టీల శ్రేణులను నామినేషన్ కేంద్రం నుంచి దూరంగా పంపించి వేశారు. ఈక్రమంలో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. నామినేషన్ కేంద్రం వద్ద ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## ఆర్ఎన్ఏ న్యూస్ ఏజెన్సీ చీఫ్ ఎడిటర్ రఘు అకాల మృతి



హైదరాబాద్, అక్టోబర్ 17:(నేటినిజం ప్రతినిధి): ఆర్ఎన్ఏ న్యూస్ ఏజెన్సీ చీఫ్ ఎడిటర్ రఘు అకాల మృతి పట్ల తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేస్తుంది. ఆయన మృతి మీడియా రంగానికి తీరని లోటు. జనగామ జిల్లా బచ్చన్నపేట కు చెందిన రఘు...1986లో ఉదయం పత్రికలో సబ్ ఎడిటర్ గా కెరీర్ మొదలు పెట్టి, క్రిష్ణపత్రిక, వర్తమానం, నేటినిజం తదితర మీడియా సంస్థల్లో బ్యూరో చీఫ్ గా పనిచేశారు. ఆ తర్వాత టివి5 లో చీఫ్ సబ్ ఎడిటర్ బాధ్యతలు నిర్వహించారు. నెల రోజులుగా ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతూ, గచ్చిబౌలిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేరిన రఘు, చికిత్స పొందుతూ నిన్న రాత్రి (శుక్రవారం) గుండెపోటుకు గురై మృతి చెందారు.

# ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపుపై ఆగ్రహం
## ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు పోరాటం
## బీజేపీ-ఎన్డీయే ప్రభుత్వ తీరుపై విమర్శలు

వరంగల్, అక్టోబర్ 17:ఓటర్ల జాబితా నుంచి పేర్లను తొలగించడం ద్వారా పౌరుల ప్రాథమిక హక్కును దూరం చేస్తున్నారని తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. ప్రజాస్వా మ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కును గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ లేవనెత్తిన ప్రధాన అంశం కూడా ఇదేనని పేర్కొన్నారు.

-ఇండియా కూటమితో పాటు విద్యార్థి, యువజన సంఘాలు నిరంత రం ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనలు చేపడుతున్నాయని శ్రీధర్‌బాబు తెలిపారు. ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగిపోతే పౌరుల ప్రాథమిక గుర్తింపునకు సంబంధించిన హక్కు దెబ్బతింటుందని అభిప్రాయపడ్డారు. బీజేపీ-ఎన్డీయే ప్రభుత్వం ప్రజల హక్కులను ఎలా దూరం చేస్తోందనే విషయాన్ని ప్రజలకు వివరించడం ప్రతిపక్ష నేతగా రాహుల్‌గాంధీ బాధ్యత అని అన్నారు. రాజకీయ పార్టీల ప్రజాస్వామ్య స్వరాన్ని గౌరవించకపోవడం ఖండనీయమని శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు.

# అనంతపురంలో మున్సిపల్ ఎన్నికల సందడి..
## రెండో రోజు భారీగా నామినేషన్లు

అమరావతి, అక్టోబర్ 17:ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ వేగవంతమైంది. అనంతపురం నగరపాలక సంస్థ పరిధిలోని 62 డివిజన్లకు సంబంధించి నామినేషన్లు దాఖలు చేయడానికి ప్రధాన పార్టీలైన తెలుగుదేశం , వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ , ఇతర పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర ఆశావహులు భారీగా తరలివస్తున్నారు. నామినేషన్ దాఖలుకు సమయం తక్కువగా ఉండటంతో (చివరి రోజు కావడంతో) కేంద్రాల వద్ద తీవ్ర రద్దీ నెలకొంది. నిన్నటి రోజున పొరుగు ప్రాంతాలైన రాయచోటి, పుంగనూరు, తిరుపతి, ధర్మవరంలలో నామినేషన్ల వేళ దాడులు, ఘర్షణ వాతావరణం చోటుచేసుకోవడంతో అనంతపురం జిల్లా పోలీసులు అత్యంత అప్రమత్తమయ్యారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా కఠిన చర్యలు చేపట్టారు. నామినేషన్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో గొడవలు జరగకుండా 144 సెక్షన్‌ను అమలులోకి తెచ్చారు.

నామినేషన్ కేంద్రంలోనికి అభ్యర్థితో పాటు కేవలం ఇద్దరికి (మరొకరికి మాత్రమే) మాత్రమే అనుమతినిస్తున్నారు. కేంద్రాల వద్ద భారీగా బలగాలను మోహరించి, ర్యాలీగా వస్తున్న శ్రేణులను బయటే అడ్డుకుంటూ.. కేవలం నిబంధనల ప్రకారం అర్హులైన అభ్యర్థులను మాత్రమే లోపలికి పంపుతున్నారు.

తొలి రోజు అనంతపురం పరిధిలో నెమ్మదిగా సాగిన ఈ ప్రక్రియలో కేవలం 16 నామినేషన్లు మాత్రమే దాఖలయ్యాయి. అయితే, నేడు దాదాపు అన్ని డివిజన్లకు సంబంధించి ప్రధాన పార్టీల అభ్యర్థులందరూ నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉందని ఎన్నికల అధికారులు అంచనా వేస్తున్నారు.

# మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగంపై ఉక్కుపాదం: డీజీపీ ఆనంద్

మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగంపై ఉక్కుపాదం: డీజీపీ ఆనంద్

హైదరాబాద్, అక్టోబర్ 17:మాదకద్రవ్యాల నిరోధానికి ఎన్నో చర్యలు తీసుకున్నామని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వ్యాఖ్యానించారు. మాదకద్రవ్యాలపై ఉక్కు పాదం మోపుతున్నామని పేర్కొన్నారు. 2029 డిసెంబర్ 31వ తేదీలోగా డ్రగ్స్ రహిత దేశంగా మార్చాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. అందుకోసం ఎన్నో కార్యక్రమాలు, వ్యూహాలను మనం చూడబోతున్నామని తెలిపారు. డ్రగ్స్ హానికరమని.. ఇవి దేశవ్యాప్తంగా విస్తరిస్తున్నాయని పేర్కొన్నారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని యువతకు డీజీపీ పిలుపునిచ్చారు. రాష్ట్రీయ ఏక్తా దివస్-2026 సందర్భంగా ఈరోజు (శనివారం) ఈగల్ ఫోర్స్ ఆధ్వర్యంలో జాతీయ మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. తెలంగాణలో మాదకద్రవ్యాల నిర్మూలన, డ్రగ్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీజీపీ సీవీ ఆనంద్ హాజరై, ప్రసంగించారు. ఆరు రోజుల క్రితం వివిధ రాష్ట్రాల్లో ఈ ర్యాలీ ప్రారంభమైందని వెల్లడించారు. ఈ ర్యాలీలో ఐదు రాష్ట్రాల వారు పాల్గొన్నారని అన్నారు.

ఐదు రోజుల తర్వాత ఈ ర్యాలీ నేడు హైదరాబాద్ చేరుకుందని డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. తెలంగాణ నుంచి ఏడుగురు మోటార్ సైకిల్ ర్యాలీలో జాయిన్ అవుతారని చెప్పారు. అక్టోబర్ 30వ తేదీన ఈ ర్యాలీ గుజరాత్ రాష్ట్రం కెవాడియా చేరుకుంటుందని తెలిపారు. ఆరోజు కెవాడియాలో జరిగే సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జన్మదిన వేడుకల్లో పాల్గొంటారని అన్నారు. భారతదేశంలో ఎన్నో సంస్కృతి సంప్రదాయాలు ఉన్నాయని తెలిపారు. మనం అందరం భారతీయులమని చాటి చెప్పేందుకే ఈ ఏక్తా దివస్ ర్యాలీ నిర్వహిస్తున్నామని వివరించారు. నషా ముక్త్ భారత్ థీమ్ పేరుతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని డీజీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు.

డ్రగ్స్ దుష్ప్రభావాలపై ఈగల్ ఫోర్స్ ప్రత్యేక దృష్టి..

కాగా, రాష్ట్రీయ ఏక్తా దివస్ సందర్భంగా నిర్వహించనున్న జాతీయ మోటార్‌సైకిల్ ర్యాలీని డీజీపీ సీవీ ఆనంద్ ప్రారంభించారు. డ్రగ్స్ దుష్ప్రభావాలపై యువతకు, విద్యార్థులకు అవగాహన కల్పించడంపై ఈగల్ ఫోర్స్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రచారంలో భాగంగా ఆయా విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ గచ్చిబౌలిలో యాంటీ డ్రగ్స్ అవేర్‌నెస్ కార్యక్రమం చేపట్టారు.

మెహదీపట్నం మీదుగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి ఈ ర్యాలీ చేరుకోనుంది. అలాగే, సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీలో యాంటీ డ్రగ్స్ అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించనున్నారు. పటాన్‌చెరు మీదుగా ఐఐటీ కందికి మోటార్‌సైకిల్ ర్యాలీ చేరుకోనుంది. అక్కడి నుంచి కర్ణాటకలోని జహీరాబాద్ ఉమ్నాబాద్ వైపు ర్యాలీ కొనసాగనుంది. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే ఈగల్ ఫోర్స్ ప్రధాన ఉద్దేశంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడంపై దృష్టిసారించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా సమాజమంతా ఏకం కావాలని ఈగల్ ఫోర్స్ అధికారులు సందేశమిచ్చారు. జాతీయ ఐక్యత, సామాజిక బాధ్యత, మాదకద్రవ్యాల వ్యతిరేక పోరాటమనే అంశాలతో ఈగల్ ఫోర్స్ అధికారులు ఈ ర్యాలీ నిర్వహిస్తున్నారు.

# ఘోరం.. అదుపుతప్పి లోయలోపడ్డ బస్సు..
## 8 మంది దుర్మరణం..!



న్యూ ఢిల్లీ, అక్టోబర్ 17: ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రయాణికులతో వెళ్తున్న ఒక బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కన లోయలో పడటంతో ఎనిమిది మంది దుర్మరణం పాలయ్యారు. మరో 17 మందికి గాయాలయ్యాయి. రాజస్థాన్ లోని కోటా సమీపంలో శనివారం తెల్లవారుజామున ఢిల్లీ-ముంబయి ఎక్స్‌ప్రెస్ వే పై ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

పోలీసులు వెల్లడించిన సమాచారం ప్రకారం.. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 27 మంది ప్రయాణిస్తున్నారు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్ నుంచి రాజస్థాన్‌లోని ఖాటూ శ్యామ్ ఆలయానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. డ్రైవర్ నిద్ర మత్తువల్లే బస్సు అదుపు తప్పిందని పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. రోడ్డు పక్కన ఉన్న రక్షణ కంచెను ఢీకొట్టి మరీ బస్సు లోయలో పడిపోయిందని పోలీసులు తెలిపారు.

ఈ ప్రమాదంలో మరణించిన ఎనిమిది మందిలో ఐదుగురు మహిళలు ఉన్నారు. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో గాయపడిన 17 మందిని కోటాలోని ఎంబీఎస్ ఆసుపత్రి, న్యూ మెడికల్ కాలేజీ ఆసుపత్రులకు తరలించారు. క్షతగాత్రులకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. క్షతగాత్రుల్లో అందరి పరిస్థితి నిలకడగా ఉందని, ఎవరికీ ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు.

ప్రమాద గురించిన సమాచారం తమకు ఉదయం 8 గంటల సమయంలో అందిందని పోలీసులు చెప్పారు. కోటా జిల్లా కలెక్టర్ పీయూష్ సమారియా, ఐజీ హరేంద్ర మహావర్ ఎంబీఎస్ ఆసుపత్రికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

## అమ్మవారి దర్శించుకున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 17:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ రూరల్ మండలం హనుమాజీపేట గ్రామంలో కొలువుదీరిన శ్రీ దుర్గాదేవి అమ్మవారిని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండపంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఆది శ్రీనివాస్ అమ్మవారి ఆశీస్సులు పొందారు.

ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, గ్రామాలు అభివృద్ధి చెందాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, కాంగ్రెస్ నాయకులు సోయినేని కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు

# జమ్మూ కాశ్మీర్లో అక్రమ చొరబాటుకు యత్నం..
## ఇద్దరు ఉగ్రవాదుల కాల్చివేత



న్యూఢిల్లీ, అక్టోబర్ 17: జమ్మూ కాశ్మీర్ నుంచి ఇండియాలోకి అక్రమంగా చొరబాటుకు యత్నించిన ఇద్దరు ఉగ్రవాదులను భద్రతా దళాలు కాల్చి చంపాయి. ఈ ఘటను శుక్రవారం అర్ధరాత్రి 3.00 గంటల తర్వాత, జమ్మూ కాశ్మీర్ కుప్వారా జిల్లాలో జరిగింది. భారత్-పాక్ సరిహద్దు అయిన లైన్ ఆఫ్ కంట్రోల్ (ఎల్‌వోసీ) వద్ద, కెరాన్ సెక్టార్‌లోని, జగ్‌మండ్ ఏరియాలో శనివారం వేకువఝామున ముగ్గురు, నలుగురు వ్యక్తులు రహస్యంగా ఇండియావైపు రావడాన్ని భారత భద్రతా దళాలు గుర్తించాయి.

ఈ ప్రాంతంలో గస్తీ నిర్వహిస్తుండగా.. ఎల్‌వోసీ నుంచి సరిహద్దు దాటి ఇండియాలోకి వచ్చేందుకు తీవ్రవాదులు ప్రయత్నించారు. ఈ క్రమంలో భారత భద్రతా బలగాలు వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించాయి. దీంతో ఉగ్రవాదులు కూడా మన సిబ్బందిపై కాల్పులు జరిపారు. వెంటనే స్పందించిన భారత ఆర్మీ ఎదురు కాల్పులు జరిపింది. వారిని గాలిస్తూ కాల్పులు జరపడంతో ఇద్దరు తీవ్రవాదులు ప్రాణాలు కోల్పోయారు. మిగిలిన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. అలాగే, ఈ ప్రాంతం మొత్తం కూంబింగ్ నిర్వహిస్తున్నట్లు ఆర్మీ తెలిపింది. తీవ్రవాదులు అక్రమ చొరబాటుకు ప్రయత్నించారని, ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మరణించారని ఆర్మీ అధికారులు వెల్లడించారు. అయితే, ఈలోపు ఇంకా ఎవరైనా ఇండియాలోకి చొరబడ్డారా అనే విషయంలో ఇంకా స్పష్టత లేదు. ఈ కాల్పులు జరిగిన ప్రాంతం పర్వతాలతో కూడి, నిర్మానుష్యంగా ఉంది. అందువల్ల అక్కడ ఉగ్రవాదుల్ని గుర్తించడం, వెంటనే స్పందించడం కొంచెం కష్టమైన విషయం. అయినప్పటికీ, ఇంకా ఎవరైనా ఉగ్రవాదులు అక్కడ దాక్కుని ఉన్నారా అనే కోణంలో ప్రస్తుతం ఈ ప్రాంతంలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

## నేడు, రేపు తెలంగాణలో మోస్తరు వర్షాలు : వాతావరణ శాఖ

హైదరాబాద్, అక్టోబర్ 17: తెలంగాణలోని పలు ప్రాంతాల్లో రేపు, ఎల్లుండి తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడుతాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందన్నారు. ఉత్తర తమిళనాడు,దానిని ఆనుకుని ఉన్న దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్ మీదుగా ఏర్పడిన ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 4.5 నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తు మధ్య కొనసాగుతోందని వివరించారు .దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్ మరియు పరిసర ప్రాంతాలలో ఉన్న సదరు ఉపరితల ఆవర్తనం నుంచి వాయవ్య బంగాళాఖాతం వరకు సగటు సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తు వరకు ద్రోణి విస్తరించి ఉందని తెలిపారు. శనివారం ఉదయం 5 గంటలకు సమయానికి బలహీన పడిందని పేర్కొన్నారు. రాబోయే మూడు రోజుల పాటు రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన ఉరుములు, గంటకు 30 నుంచి 40 కి.మీ. వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది హైదరాబాద్ వాతావరణ కేంద్రం సంచాల కులు తెలిపారు.




# మహిళలకు సవాలుతో కూడిన సమయం : మెనోపాజ్

## (అక్టోబర్ 18న "ప్రపంచ మెనోపాజ్ (రుతువిరతి) దినోత్సవం" సందర్భంగా)

మహిళలకు వారి జీవితంలోని వివిధ వయస్సులలో మెనోపాజ్ లేదా రుతువిరతితో పాటు నెలసరి నుండి తప్పించుకోవడం సాధ్యం కాదు. అంతర్జాతీయ మెనోపాజ్ సొసైటీ, మెనోపాజ్ గురించి అవగాహన పెంచడానికి, ప్రపంచవ్యాప్తంగా మహిళల జీవితంలోని కీలకమైన, ఫలవంతమైన దశలో వారి అనుభవాన్ని మెరుగుపరచడానికి 2009లో "ప్రపంచ మెనోపాజ్ (రుతువిరతి) దినోత్సవాన్ని" ఒక వార్షిక కార్యక్రమంగా స్థాపించింది. అలాగే, మెనోపాజ్ దశలో ఉన్న మహిళలకు వారి ఆరోగ్యం, శ్రేయస్సును మెరుగుపరచడానికి అందుబాటులో ఉన్న సహాయక మార్గాలను తెలియజేయడం కూడా ఈ దినోత్సవ ఉద్దేశ్యం. ప్రపంచ మెనోపాజ్ దినోత్సవం-2026 యొక్క ఇతివృత్తంగా "నడి వయస్సులో దీర్ఘకాలిక నొప్పి". ఇది ఒళ్లు నొప్పులతో కూడి కండరాలు బిగుసుకుపోవడం, తలనొప్పులు, కటి నొప్పి వరకు ఉండే బాధను హైలైట్ చేస్తుంది. ఈ దినోత్సవం నడి వయస్సులో మహిళలకు వచ్చే నొప్పి, మానసిక స్థితి మార్పుల గురించి అవగాహన కల్పించడానికి ఉద్దేశించబడింది.

### మెనోపాజ్ సగటు వయస్సు:

ఒక స్త్రీకి చివరి రుతుస్రావం అయిన ఒక సంవత్సరం తర్వాత మెనోపాజ్ వస్తుంది. చాలా మంది మహిళలకు, మెనోపాజ్ రావడం వివిధ రకాల భావోద్వేగాలను రేకెత్తిస్తుంది. తమ రుతుచక్రం ఇక లేనందుకు మహిళలు సంతోషిస్తారు. కాని రుతువిరతి సమయంలో ఎదురయ్యే సమస్యలు వ్యక్తిని బట్టి మారుతుంటాయి. చాలా మంది మహిళలు 45 నుండి 55 సంవత్సరాల వయస్సు మధ్య మెనోపాజ్‌ను అనుభవిస్తారు. మెనోపాజ్ సగటు వయస్సు 51 సంవత్సరాలు, కానీ 40 సంవత్సరాల వయస్సు కంటే ముందు మెనోపాజ్‌కు చేరుకునే వారు కూడా చాలా తక్కువగా ఉంటారు. మెనోపాజ్ సమయంలో వారి భావోద్వేగ, శారీరక, మానసిక ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే లక్షణాలు కనిపిస్తాయి.

### లక్షణాలు మరియు నివారణ చర్యలు :

పలు ఇతర కారణాల వల్ల కూడా మెనోపాజ్ కష్టంగా ఉంటుంది. హార్మోన్లలో హెచ్చుతగ్గుల వల్ల వేడి ఆవిర్లు, రాత్రిపూట చెమటలు, యోని పొడిబారడం, సంభోగ సమయంలో అసౌకర్యం, నిద్రలేమి, డిప్రెషన్ లేదా ఆందోళన, ఇతర నిద్ర సంబంధిత సమస్యలు, మూడ్ మార్పులు, చిరాకు వంటి నియంత్రించడం కష్టమైన లక్షణాలు కూడా కలుగుతాయి. ఇవి రోజువారీ కార్యకలాపాలకు కూడా తీవ్ర ఆటంకం కలిగిస్తాయి. ఈ బాధాకరమైన లక్షణాలను నియంత్రించడంలో సహాయపడటానికి, మహిళలు చురుకుగా ఉంటూ, తగినంత నీరు త్రాగుతూ, ఆరోగ్యకరమైన ఆహారం విధిగా తీసుకోవాలి. ఒక మహిళ మెనోపాజ్‌కు చేరుకున్న తర్వాత, వారు ఆస్టియోపొరోసిస్, గుండె జబ్బులు, బరువు తగ్గడం, మూత్ర సంబంధిత అసౌకర్యం వంటి మెనోపాజ్ అనంతర సమస్యలను ఎదుర్కొంటారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మహిళలు అవసరమైన పరిజ్ఞానం, ఆత్మవిశ్వాసం, మద్దతుతో ఈ సహజ పరివర్తనను స్వీకరించేలా ప్రోత్సహిద్దాం. మెనోపాజ్‌ను ఒక వైద్య సమస్య, సామాజిక నిషిద్ధం సమస్యగా కాకుండా, జీవితంలో ఒక అతి సాధారణ దశగా అర్థం చేసుకోవడం ముఖ్యం.

మెనోపాజ్ అనేది మహిళలకు ఒక సవాలుతో కూడిన సమయం కావచ్చు. సహాయం కోసం వారి వైద్యుడిని సంప్రదించడం చాలా ముఖ్యం. తగిన సహాయక వ్యవస్థను కనుగొనడం కూడా ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. ప్రపంచ మెనోపాజ్ దినోత్సవం సందర్భంగా అనేక మహిళా ఆరోగ్య సంబంధిత సంస్థలు సెమినార్లు, వర్క్‌షాప్‌లు, వెబినార్లు, ప్రత్యేక ప్రసంగాలతో పాటుగా ఇతర సంబంధిత కార్యక్రమాలను నిర్వహిస్తాయి.



మెనోపాజ్ అసౌకర్యాలను అధిగమించడానికి తమకు దోహదపడిన వ్యక్తిగత అనుభవాలను పంచుకోవడానికి కూడా మహిళలను ప్రోత్సహించాలి.

-మధుపాళీ
9949700037

# జామ్‌సాహెబ్ స్మారక యువజన మార్పిడి కార్యక్రమం రెండో సంచిక..

## విజయవంతంగా పూర్తి చేసిన పోలిష్ యువ ప్రతినిధి వర్గం



న్యూఢిల్లీ, అక్టోబర్ 17: జామ్‌సాహెబ్ స్మారక యువజన మార్పిడి కార్యక్రమం రెండో సంచికను ఈ నెల 7వ తేదీ నుంచి 14వ తేదీ వరకు నిర్వహించారు. 19 మంది సభ్యులతో కూడిన పోలిష్ యువజన ప్రతినిధి వర్గం గుజరాత్‌ను, మహారాష్ట్రను, న్యూ ఢిల్లీని సందర్శించింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి చరిత్రాత్మక ప్రాధాన్యం కలిగిన స్థలాలను చూడడం, సాంస్కృతిక కార్యకలాపాల్లో పాలుపంచుకోవడం, భారతదేశ విజ్ఞనశాస్త్ర పరమైన, ఆర్థికశాస్త్ర పరమైన, సాంస్కృతిక పరమైన అభివృద్ధిని చాటే సంస్థలను సందర్శించడంతో పాటు, భారతీయ సీనియర్ నేతలతో మాటామంతీ జరిపారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2024 ఆగస్టులో పోలెండుకు అధికార పర్యటనకు వెళ్లిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని గురించి ప్రకటించారు. భారత్-పోలెండ్ వ్యూహాత్మక భాగస్వామ్యానికి సంబంధించిన పంచవర్ష ప్రణాళికను 2024-2028 సంవత్సరాల మధ్య అమలు చేయాలని సంకల్పించి, అందులో భాగంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. పోలెండ్ యువత ఏటా భారతదేశానికి వచ్చి భారత చరిత్ర, సంస్కృతి, సంస్థలు, సమకాలీన అభివృద్ధిని తెలుసుకోవడానికి ఒక అవకాశాన్ని ఈ కార్యక్రమం అందిస్తుంది.

గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో బాలాచడీ పోలిష్ బాలల శిబిర స్మారక కట్టడాన్ని సందర్శించడం ఈ కార్యక్రమంలో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. మహారాజా జామ్‌సాహెబ్ దిగ్విజయ్ సింగ్‌జీ రంజిత్‌సింగ్‌జీ జడేజా మానవీయ దృక్పథంతో అందించిన తోడ్పాటును ఈ కట్టడం గుర్తుకు తెస్తుంది. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో, యుద్ధం వల్ల చెల్లాచెదురు అయిన పోలిష్ బాలలకు మహారాజా ఆశ్రయాన్ని కల్పించి, విద్యాబుద్ధులను నేర్పించడంతో పాటు చికిత్సాపూర్వక సహాయాన్ని కూడా అందించారు. ఆయన చూపిన కరుణ 'దోబ్రీ మహారాజా' (మనసున్న మారాజు) అనే చిరకాల గుర్తింపును ఆయనకు తెచ్చిపెట్టింది. ఈ యాత్రతో ఉమ్మడి చరిత్రతో ముడిపడిన ఈ అసాధారణ అధ్యాయంతో పాటు రెండు దేశాల మధ్య ఉన్న ప్రగాఢ సంబంధాలను గురించి తెలుసుకునే అవకాశం ప్రతినిధి వర్గానికి కలిగింది.

ప్రతినిధి వర్గం దీని తరువాత మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో వాలివాడే పోలిష్ శరణార్థి శిబిర స్మారకాన్ని కూడా సందర్శించింది. ఈ స్మారకం రెండో ప్రపంచ యుద్ధ కాలంలోనూ, ఆ తర్వాత వేలాది పోలిష్ శరణార్థులకు ఆశ్రయాన్ని కల్పించింది.

కష్ట కాలంలో పోలెండు జాతీయులకు భారత్ మానవతాపూర్వక మద్దతును అందించిన విషయాన్ని బాలాచడీ, వాలివాడే సందర్శనలు స్పష్టం చేశాయి. ఈ సందర్శనలు భారత్, పోలెండ్ మైత్రితో పెనవేసుకున్న చారిత్రక పునాదులను బలోపేతం చేశాయి.

న్యూఢిల్లీలో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ పోలిష్ యువ ప్రతినిధి వర్గానికి రాత్రి భోజన కార్యక్రమంతో పాటు, అదే సందర్భంగా చర్చా కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అతిథులుగా పాల్గొన్న యువజనులు మంత్రితో సంభాషించి, తమ ఆలోచనలను వెల్లడించారు. వారు యువత అభివృద్ధి, యువ జన భాగస్వామ్యం అంశాలలో భారత్ దృష్టికోణాన్ని అర్థం చేసుకొనేందుకు ప్రయత్నించారు. భారత్, పోలెండ్ మధ్య అవగాహనను, సంబంధాలను బలపరుచుకోవడానికి ప్రజల మధ్య పరస్పర సంబంధాలు ప్రధాన పాత్రను పోషిస్తాయని ఈ మాటామంతీ కార్యక్రమం చాటింది.

వారం రోజుల పాటు కొనసాగిన ఈ కార్యక్రమంలో భారతదేశ సంపన్న చరిత్ర, సాంస్కృతిక వారసత్వాలను గురించి తెలుసుకొనే అవకాశం లభించినందుకు ప్రతినిధి వర్గం కృతజ్ఞతలు తెలిపింది. జామ్‌సాహెబ్, వాలివాడే శిబిర స్మారకాలు, గాంధీనగర్‌లోని దండి కుటీరం, పోర్‌బందర్‌లోని కీర్తి మందిరాల సందర్శన యువతకు ఎప్పటికీ గుర్తుంచుకోదగిన అనుభూతులను పంచింది. ఆప్యాయతభరిత ఆతిథ్యాన్ని అందించినందుకు ప్రతినిధి వర్గం సభ్యులు ప్రశంసలు కురిపించారు. ఈ యాత్ర ఎన్నో గొప్ప అనుభూతులను అందించిందని, దీంతో భారత్ పట్ల తమకున్న అవగాహన పెంపొందిందని, దేశంతో తమ అనుబంధం బలోపేతం అయిందని వారు అన్నారు.

కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్‌తో భేటీ అయ్యే అవకాశం కూడా ప్రతినిధి వర్గానికి లభించింది. భారత్-పోలెండ్ సంబంధాలతో ముడిపడిన అంశాలు, ద్వైపాక్షిక సంబంధాలను పటిష్టపరుచుకోవడంలో యువ బృందాల రాకపోకలు పోషించగల పాత్రపై ప్రతినిధి వర్గం సభ్యులు మంత్రితో చర్చించారు. భారత్-పోలెండ్ సంబంధాల పురోగతిలో యువ దౌత్యానికి ఉన్న ప్రాధాన్యానికి అద్దం పడుతూ రెండో సంచికను విజయవంతంగా సమాప్తం చేశారు. ఈ కార్యక్రమం యువతను ఉభయ దేశాల ఉమ్మడి చరిత్రతో, సమకాలీన భారత్‌తో జోడించి మహారాజా జామ్‌సాహెబ్ వారసత్వాన్ని ముందుకు తీసుకుపోవడంతో పాటు, ఇరు దేశాల మధ్య ప్రగాఢ మైత్రిని బలపరచింది.

# సవరించిన సహాయ పథకంపై జాతీయ క్రీడా సమాఖ్యలకు కార్యాచరణ మార్గదర్శకాలు జారీ

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 17: జాతీయ క్రీడా సమాఖ్య (ఎన్ఎస్ఎఫ్)ల కోసం సవరించిన సహాయ పథకం సంబంధిత కార్యాచరణ మార్గదర్శకాలను కేంద్ర క్రీడా-యువజన వ్యవహారాల మంత్రిత్వశాఖ ఇవాళ జారీ చేసింది. ఈ మేరకు 2026-27 నుంచి 2030-31 (16వ ఆర్థిక సంఘం కాలం) వరకు 7,386.74 కోట్ల వ్యయంతో పథకం కొనసాగించేందుకు ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది. పథకంలోని వివిధ భాగాల సంబంధిత సవరించిన సహాయ నిబంధనలను కూడా ఈ మార్గదర్శకాలు నిర్దేశిస్తున్నాయి.

ఒలింపిక్స్, ఆసియా క్రీడలు, కామన్వెల్త్ క్రీడలు, పారాలింపిక్స్, ప్రపంచ ఛాంపియన్‌షిప్ తదితర ప్రధాన అంతర్జాతీయ క్రీడా స్పర్ధలలో పాల్గొనే భారత క్రీడాకారులకు మద్దతు దిశగా ఈ పథకం ఓ కీలక యంత్రాంగంగా ఉంటుంది.

జాతీయ కోచింగ్ శిబిరాల నిర్వహణ, అకాడమిలలో శిక్షణతోపాటు క్రీడాకారులకు వసతి, భోజనం, క్రీడా పరికరాలు (కిట్లు), బీమా, క్రీడా విజ్ఞాన సేవలు సహా ఈ పథకం కింద మద్దతు లభిస్తుంది. విదేశీ కోచ్‌లు, హై పెర్ఫార్మెన్స్ డైరెక్టర్లు, ఫిజియో థెరపిస్టులు, క్రీడా శాస్త్రవేత్తలు, వైద్యుల తదితర సహాయ సిబ్బంది నియామకం, అంతర్జాతీయ శిక్షణ, పోటీల ద్వారా విదేశీ అనుభవం, సీనియర్- జూనియర్, సబ్-జూనియర్ జాతీయ ఛాంపియన్‌షిప్‌ల నిర్వహణ, క్షేత్రస్థాయి-జూనియర్ క్రీడాకారులకు ప్రోత్సాహం, జాతీయ క్రీడా సమాఖ్యలకు నిర్వహణ, పాలనాపరమైన చేయూత ఉంటుంది.

భారత దీర్ఘకాలిక క్రీడా దార్శనికత సహా 2036 ఒలింపిక్ బిడ్, 2030 కామన్వెల్త్ గేమ్స్ సన్నాహాలకు తగినట్లుగా అనేక కొత్త వ్యూహాత్మక అంశాలను కూడా సవరించిన పథకంలో చేర్చారు.

అంతర్జాతీయ క్రీడా కార్యక్రమాల నిర్వహణకు సహాయ మొత్తం పెంపు: దేశంలో అంతర్జాతీయ టోర్నమెంట్ల నిర్వహణకు ఇచ్చే ఆర్థిక సహాయాన్ని సవరించిన పథకంలో గణనీయంగా పెంచారు. దీని ప్రకారం... ఇకపై ఒక అంతర్జాతీయ కార్యక్రమం నిర్వహణకు దాని స్థాయి, ప్రాధాన్యం, పాల్గొనే దేశాలు-క్రీడాకారుల సంఖ్యను బట్టి 'ఎన్ఎస్ఎఫ్'లకు రూ.50 కోట్ల దాకా సహాయం అందుతుంది. దీనికి సంబంధించి మంత్రిత్వ శాఖలోని క్రీడల విభాగం కార్యదర్శి నేతృత్వంలోని కమిటీ ఆయా సమాఖ్యల ప్రతిపాదనలను మదింపు చేస్తుంది.

ఒలింపిక్ శిక్షణ కేంద్రాలలో శిక్షణ: ఒలింపిక్స్ సహా భారీ అంతర్జాతీయ క్రీడా పోటీలకు సిద్ధమయ్యే క్రీడాకారులకు ప్రస్తుతం 'నేషనల్ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్', అకాడమీలు, ప్రైవేట్ క్రీడా ప్రాంగణాలతోపాటు విదేశీ శిక్షణ కేంద్రాల్లోనూ శిక్షణ ఇస్తున్నారు. మరోవైపు ఉన్నత ప్రమాణాలతో ప్రత్యేక శిక్షణ ఇవ్వడానికి, అత్యాధునిక క్రీడా విజ్ఞాన పరికరాలతో ఒలింపిక్ శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ప్రతి క్రీడకూ ప్రత్యేకంగా ఈ కేంద్రాలు ఏర్పాటవుతాయి. వీటిలో అత్యుత్తమ, ఆధునిక శిక్షణ సౌకర్యాలు, నిపుణులు ఉంటారు. దీనివల్ల భారత క్రీడాకారులు విదేశీ శిక్షణపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుంది. ఈ కేంద్రాల్లో శిక్షణ పొందే అగ్రశ్రేణి క్రీడాకారులకు కోచ్‌లు, సాంకేతిక సిబ్బంది, క్రీడా విజ్ఞాన సేవలు, ప్రత్యేక పరికరాలు, సాంకేతిక మద్దతు దిశగా సహాయం లభిస్తుంది.

జాతీయ క్రీడలకు మద్దతు: జాతీయ క్రీడల ప్రాధాన్యం, సముచిత రీతిన, తగిన స్థాయిలో వాటి నిర్వహణ అవసరాన్ని సవరించిన పథకంలో పరిగణనలోకి తీసుకున్నారు. ఆ మేరకు జాతీయ క్రీడల నిర్వహణ కోసం క్రీడా పరికరాలు, టైమింగ్, స్కోరింగ్, ఫలితాల సేవలు, సాంకేతిక అధికారుల పారితోషికం, సాంకేతిక నిర్వహణ తదితరాల కోసం రూ.50 కోట్లదాకా సహాయం అందించడానికి వీలుగా నిధులు కేటాయించారు.

ప్రపంచవ్యాప్త విస్తరణ కోసం స్వదేశీ క్రీడల జాతీయ సమాఖ్యలకు సహాయం: స్వదేశీ క్రీడల ప్రపంచవ్యాప్త విస్తరణ లక్ష్యంగ సవరించిన పథకంలో ఒక మద్దతు విభాగాన్ని జోడించారు. ఒలింపిక్స్, ఆసియా క్రీడలు లేదా కామన్వెల్త్ క్రీడలు వంటి అంతర్జాతీయ పోటీలలో వీటిని ప్రదర్శన ఈవెంట్లుగా చేర్చడంలో జాతీయ సమాఖ్యల కృషికి తోడ్పాటుగా ఇతర దేశాలలో జాతీయ సమాఖ్యల స్థాపకు ఈ మద్దతు ఉపయోగపడుతుంది. అలాగే, భారత్‌లో కార్యాలయాలు గల స్వదేశీ క్రీడల అంతర్జాతీయ, ఖండాంతర సమాఖ్యలకు చేయూత లభిస్తుంది.

వర్ధమాన దేశాలతో అంతర్జాతీయ క్రీడా సహకార కార్యక్రమాలు: దేశంలోని భారత క్రీడా ప్రాధికార సంస్థ (ఎస్ఏఐ) ప్రాంగణాలలోనే కాకుండా ఇతర కేంద్రాలలోనూ 'హై పెర్ఫార్మెన్స్ సెంటర్లు', శిక్షణ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. స్కాలర్‌షిప్, రాయితీ సహిత సదుపాయాల వినియోగం ద్వారా క్రీడాకారులు, కోచ్‌లకు శిక్షణ సౌలభ్యం ఉంటుంది. కాబట్టి, వర్ధమాన దేశాలకు భారత్ ఒక అగ్రశ్రేణి క్రీడా భాగస్వామి కాగలదు. తదనుగుణంగా అంతర్జాతీయ సహకారానికి సహాయం దిశగానూ సవరించిన పథకంలో ఒక నిబంధనను జోడించారు.

బ్రిక్స్.. బిమ్‌స్టెక్ వంటి బహుళపక్ష సంస్థల క్రీడా పోటీలకు మద్దతు: బ్రిక్స్, బిమ్‌స్టెక్ సహా అటువంటి ఇతర బహుళపక్ష సంస్థల కోసం నిర్వహించే క్రీడా పోటీలు, క్రీడల సంబంధిత సమావేశాలు, సదస్సులు, పరిశోధన కార్యకలాపాలు, వర్క్‌షాప్‌ల నిర్వహణకు ఆర్థిక సహాయం అందించే నిబంధనను కూడా సవరించిన పథకంలో చేర్చారు.

భారత్‌లో కార్యాలయాలు గల గుర్తింపు పొందిన అంతర్జాతీయ-ఖండాంతర సంస్థలకు మద్దతు: భారత్‌లోగల గుర్తింపు పొందిన అంతర్జాతీయ, ఖండాంతర సంస్థలకు మద్దతు దిశగానూ సవరించిన పథకంలో 'ఎన్ఎస్ఎఫ్, ఎన్ఓసీ'ల కింద నిధులను కేటాయించారు. దీనిద్వారా క్రీడల మంత్రిత్వశాఖ కార్యదర్శి నేతృత్వంలోని కమిటీ సిఫారసుల మేరకు ప్రతి క్రీడా కార్యక్రమానికీ చేయూత నివ్వవచ్చు.

# ఆసియా క్రీడలు-2026లో స్వర్ణం సాధించిన భారత మహిళా కబడ్డీ

## బృందంతో రైల్ భవన్లో సమావేశమైన కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 17: న్యూఢిల్లీలోని రైల్ భవన్‌లో భారతీయ మహిళా కబడ్డీ బృందానికి చెందిన సభ్యులతో కేంద్ర రైల్వే శాఖ మంత్రి శ్రీ అశ్వనీ వైష్ణవ్ ఈ రోజు సమావేశమయ్యారు. ఈ బృందం జపాన్‌లోని అయిచి-నగోయాలో జరిగిన ఆసియా క్రీడలు-2026లో స్వర్ణం సాధించింది.

2026 సెప్టెంబర్ 26న జరిగిన ఫైనల్లో భారత మహిళా కబడ్డీ బృందం ఇరాన్‌పై 37-34 తేడాతో గెలిచి స్వర్ణం సాధించింది. తద్వారా ఆసియా క్రీడల్లో తన టైటిల్‌ను నిలబెట్టుకుంది. స్వర్ణం సాధించిన భారతీయ రైల్వేకు చెందిన క్రీడాకారిణులను అభినందించారు. వారి అంకితభావం, పట్టుదల, క్రీడా నైపుణ్యంతో త్రివర్ణ పతాకాన్ని సగర్వంగా ఎగురవేసి, దేశానికి గౌరవాన్ని తీసుకువచ్చారని ప్రశంసించారు. ఈ బృందానికి నీతా మోరేశ్వర్ దాద్వే కోచ్‌గా, పుష్పా రాణా కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నారు.

మంత్రిని కలుసుకున్న రైల్వే క్రీడాకారిణుల్లో ప్రధాన కోచ్ దక్షిణ మధ్య రైల్వేకి చెందిన నీతా మోరేశ్వర్ దాద్వే, దక్షిణ మధ్య రైల్వేకి చెందిన రీతూ నేగి, ఉత్తర రైల్వేకి చెందిన పూజ, దక్షిణ మధ్య రైల్వేకి చెందిన పింకీ రాయ్, పశ్చిమ రైల్వేకి చెందిన సోనాలి విష్ణు షింగటే, రాజ్ రాణి ఉన్నారు. రైల్వే స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు ద్వారా క్రీడా ప్రతిభను ప్రోత్స హించడంలో భారతీయ రైల్వేల కు సుదీర్ఘ చరిత్ర ఉంది. దీనికి చెందిన క్రీడాకారులు ఒలింపిక్ క్రీడలు, ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లు, ఆసియా క్రీడలు, కామన్వెల్త్ క్రీడలతో సహా ప్రధాన అంతర్జాతీయ పోటీల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించారు. ఉద్యోగాలతో పాటుగా క్రీడలను కూడా కొనసాగించేందుకు సంస్థాగత సహకారం, అవకాశాలను కల్పించడం ద్వారా దేశంలో క్రీడా ప్రతిభ అభివృద్ధికి భారతీయ రైల్వేలు నిరంతరం తోడ్పడుతున్నాయి..

# ముతునూరు కొండపై నవరాత్రి ఉత్సవాలు

## భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయం.. కనువిందు చేస్తున్న

ఆదిలాబాద్, అక్టోబర్ 17: ఆదిలాబాద్ జిల్లాలోని ఇంద్రవెల్లి మండలం ముత్తునూరు గ్రామంలో కొండపై వెలసిన దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో, జాతర వాతావరణం లో వైభవంగా కొనసాగుతున్నాయి. ధనోరా, ఇంద్రవెల్లి, కేస్లాపూర్, గిన్నెర తదితర పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించు కుంటు న్నారు. ఉత్సవాల సందర్భంగా గ్రామస్థులు ప్రతిరోజూ అన్న దానం, భోజన వితరణ కార్యక్ర మాలు నిర్వహిస్తున్నారు. ముత్నూర్ ప్రధాన రహదారి నుంచి కొండపైకి వెళ్లే మార్గ మంతా విద్యుద్దీపాలతో అలంకరి ంచడంతో రాత్రివేళ ఆ ప్రాంతం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. కొండపై వెలసిన దుర్గామాతకు మొక్కులు చెల్లించుకుంటే కోరి కలు నెరవేరుతాయని భక్తుల ప్ర గాఢ విశ్వాసం. ముఖ్యంగా సం తానం లేని దంపతులు అమ్మ వా రిని దర్శించుకుని మొక్కులు చెల్లిం చుకుంటే సంతాన ప్రాప్తి కలుగు తుందని స్థానికులు విశ్వసిస్తున్నారు.




# వైభవంగా నవరాత్రి ఉత్సవాలు

## భక్తిపారవశ్యంలో మండల ప్రజలు అర్ధరాత్రి వరకు దాండియా నృత్యాలు.. భక్తులకు అన్నదాన కార్యక్రమాలు

ఆదిలాబాద్, అక్టోబర్ 17: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం మండలంలోని అందుతాండ తండా వివిధ గ్రామాల లో దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. మహారాష్ట్ర సరిహద్దుకు సమీపంలో ఉన్న ఈ ప్రాంతంలో నవరాత్రి వేడుకలను సనాతన ధర్మ సంప్రదాయాల ప్రకారం భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. కొందరు ఒకపూట ఉపవాసం ఉండగా, మరికొందరు తొమ్మిది రోజుల పాటు ఉపవాస దీక్షలు, కాలికి చెప్పులు లేకుండా చేపడుతున్నారు. ఇంకొందరు ప్రత్యేక నియమాలతో దీక్షలు పాటిస్తూ, తొమ్మిది రోజుల వరకు ఎర్ర కాసా య వస్త్రాలను ధరించి దీక్షను అమ్మవారిని ఆరాధిస్తున్నారు.

మండలంలోని అందు తండా గ్రామానికి ప్రతిరోజూ వేలాది మంది భక్తులు తరలివచ్చి జ్వాలాముఖి దేవితో పాటు ఆలయ మహారాజ్ రామ్‌సింగ్ దర్శనం చేసుకుంటున్నారు. ఉత్సవాలకు వచ్చే భక్తుల కోసం నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

అదేవిధంగా మండల కేంద్రంతో పాటు శంకర్గూడ, ముతనూర్, ధన్నూరా, శంకర్‌గూడ, బిక్కుతండా తదితర గ్రామాల్లోనూ నవదుర్గామాత నవరాత్రి ఉత్సవాలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. రాత్రి వేళల్లో అర్ధరాత్రి వరకు దాండియా నృత్యాలలో యువతి యువకులు చిన్నారులు నిర్వహిస్తూ భక్తి శ్రద్ధ సంబరాల్లో మునిగిపోతున్నారు. మహారాష్ట్ర సంప్రదాయాల ప్రభావం ఉన్న ఈ ప్రాంతంలో నవరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు, ఉపవాస దీక్షలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటోంది. దసరా పండుగ వరకు మండలవ్యాప్తంగా ఉత్సవాలు మరింత ఉత్సాహంగా కొనసాగనున్నాయి.

# విద్యుత్ సమస్యలు పరిష్కారించకుంటే ఆందోళనలే

ఆదిలాబాద్, అక్టోబర్ 17: విద్యుత్ సమస్యలతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, తీర్చకుంటే ఆందోళన చేస్తామని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గుర్రం రాజా రాంరెడ్డి హెచ్చరించారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్లో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ప్రస్తుతం వేసవికాలం రాక ముందే విద్యుత్ మాటిమాటికి పోయి ప్రజలు ఇక్కట్లు పడుతున్నారని ఆయన విమర్శించారు. ఎన్నికలకు ముందు విద్యుత్ నిరంతరం సరఫరా చేస్తామని హామీ ఇచ్చి, గెలిచిన అనంతరం విద్యుత్ సమస్యను ఏమాత్రం పట్టించుకోవడంలేదని ఆయన విమర్శించారు. వారంలోగా విద్యుత్ సమస్యను పరిష్కరించుకుంటే, స్థానిక విద్యుత్తు సబ్ స్టేషన్ ముట్టడిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శి ఎస్. జనార్ధన్, నేతలు రాములునాయక్, గంగాధర్, ప్రభుదాస్, మున్వర్ అలీఖాన్, ఫజల్ ఖాన్, భరత్ కుమార్, రాకేష్, నర్సాగౌడ్, సాయినాయక్, ఎ.సాయి, రవి పాల్గొన్నారు.

# ఈశాన్య ప్రాంతంలో ఉల్లిపాయల లభ్యతను పెంచడానికి మొదటి సారి అగర్తల వెళ్లనున్న కాందా ఎక్స్‌ప్రెస్

## రెండు కాందా ఎక్స్‌ప్రెస్ ర్యాకులు, 44 ట్రక్ కన్‌సైన్‌మెంట్లలో 2,800 మెట్రిక్ టన్నులకు పైగా బఫర్ ఉల్లిపాయల తరలింపు

### ఈ నెల 18 కల్లా అగర్తలకు చేరనున్న సుమారు 440 మెట్రిక్ టన్నుల బఫర్ స్టాక్

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 17:రానున్న పండుగల కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ఉల్లిపాయల లభ్యతను పెంచడంతో పాటు ఉల్లి తక్కువ ధరలకు అందేటట్టు చూడటానికిగాను వినియోగదారు వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ శాఖ ముఖ్య చర్యను తీసుకుంది.. ధరల స్థిరీకరణ నిధి (పీఎస్ఎఫ్)లో భాగంగా అత్యవసర పరిస్థితులలో వినియోగార్థం అట్టిపెట్టిన ఆహార నిల్వల (బఫర్ స్టాక్)లో నుంచి ఉల్లిగడ్డల పంపిణీని విస్తరిస్తున్నది. ఈ క్రమంలో మొదటి సారి కాందా ఎక్స్‌ప్రెస్‌తో త్రిపుర లోని అగర్తలకు ఉల్లిపాయలను పంపుతున్నారు. దాదాపుగా 440 మెట్రిక్ టన్నుల ఉల్లిగడ్డలను నింపిన ఈ కన్‌సైన్‌మెంట్ ఈ నెల 18 నాటికి అగర్తలకు చేరుకొనే అవకాశం ఉంది.

ఈ కార్యక్రమం ఈశాన్య ప్రాంతంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉల్లిపాయ పంపిణీ నెట్‌వర్క్ విస్తరణను సూచిస్తోంది. కాందా ఎక్స్‌ప్రెస్ ద్వారా అస్సాముకు బఫర్ ఉల్లిగడ్డలను విజయవంతంగా చేరవేసిన తరువాత, ఈ సరకు సరఫరాను చేపట్టారు. అగర్తలకు సరకు తరలింపు చర్య సరఫరా వ్యవస్థను విస్తరించాలన్న, చివరి మజిలీ వరకు లభ్యతను మెరుగుపరచాలన్న, దేశంలో అన్ని ప్రాంతాల్లో వినియోగ కేంద్రాల వరకు తక్కువ ధర ఉల్లిపాయలను సకాలంలో చేరవేయాలన్న ప్రభుత్వ నిబద్ధతను ప్రస్ఫుటం చేస్తోంది.

త్రిపురలో ఉల్లిపాయల పంపిణీని పటిష్టపరచడానికి కాందా ఎక్స్‌ప్రెస్ సేవలు మొదలు

ఈ కార్యక్రమం త్రిపుర లోని ఎనిమిది జిల్లాలకు గాను ఏడు జిల్లాల్లో మార్కెట్టు లభ్యత విస్తరించగలదని ఆశిస్తున్నారు. ఆ ఏడు జిల్లాలు ఇవి.. ధలాయి, దక్షిణ త్రిపుర, ఖోవై, ఉనాకోటి, పశ్చిమ త్రిపుర, గోమతి, సోపాహిజాలా. ఇంతవరకు, కాందా ఎక్స్‌ప్రెస్‌కు చెందిన రెండు ర్యాకుల్లో (వీటిలో క్రమానుగతంగా 840 మెట్రిక్ టన్నులు, 452 మెట్రిక్ టన్నుల ఉల్లిగడ్డను నింపారు) పాటు, 44 ట్రక్కుల (వీటిలో మొత్తం 1,513.46 మెట్రిక్ టన్నుల ఉల్లిగడ్డ నింపారు) ద్వారా ఈశాన్య ప్రాంతానికి బఫర్ ఉల్లిపాయల సరకును సరఫరా చేశారు. ఉల్లిపాయ సరకును అస్సామ్, త్రిపుర, నాగాలాండ్‌లలోని ప్రధాన ప్రాంతాలైన కామరూప్, గువాహాటీ, గోమతీ, దీమాపూర్, సోపాహిజాలా, కోహిమా, నియులాండ్, చుమౌకేదిమాలకు పంపిణీ చేశారు.

రైలు, రోడ్డు మార్గాల ద్వారా పంపిణీని విస్తరించడంతో బఫర్ స్టాకు రవాణాను మెరుగుపరచడంతో పాటు పూర్తి ఈశాన్య ప్రాంతంలోని ప్రధాన వినియోగ కేంద్రాలు అన్నిటికీ సరఫరాలను అందించాలన్నదే ముఖ్యోద్దేశం.

తాజా ఖరీఫ్ సరకు రాకతో మెరుగుపడనున్న మార్కెట్టు లభ్యత.. అంగడి ధరల తగ్గుముఖం

ఖరీఫ్ తాలూకు కొత్త పంట దిగుబడి పెరగడంతో పాటే ప్రధాన మార్కెట్టులలో ఉల్లిపాయల అంగడి ధరలూ తగ్గాయి. అఖిల భారతీయ సగటు సంత ధర సెప్టెంబర్‌లో క్వింటాలుకు దాదాపు రూ.3,600 ఉండగా ఈ నెలలో అది సుమారు రూ.3,300కు దిగివచ్చింది.

ఉల్లి నిల్వలలో నుంచి క్రమం తప్పక ఉల్లిగడ్డలను విడుదల చేస్తుండటంతో, మార్కెట్టుల్లో సరఫరాలు పెరుగుతున్నాయి. సరకు అందుబాటు కూడా మెరుగు పడుతోంది. చిల్లర ధరలను నియంత్రించడంలో తోడ్పాటు లభిస్తోంది. వినియోగదారు వ్యవహారాల విభాగం ఇప్పటి మార్కెట్టు పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని, వినియోగదారులకు తక్కువ ధరలకు ఉల్లిని అందించడానికి తగిన చర్యలను తీసుకుంటోంది.

211 నగరాల్లో రిటైల్ ఉల్లి ధరల క్షీణత.. ప్రాంతీయ స్థాయిలో ధరల అంతరాలు తగ్గాయి

గత రెండు వారాల్లో, 211 నగరాల్లో ఉల్లి చిల్లర విక్రయ ధరలలో ఒక్కో కిలోకు రూ.1 మొదలు రూ.3 వరకు తగ్గుదల నమోదైంది. ఈ తగ్గుదల ఆంధ్రప్రదేశ్, అస్సామ్, చండీగఢ్, ఛత్తీస్‌గఢ్, దాద్రా, నగర్ హవేలీ, దమన్, దీవ్, గోవా, హిమాచల్ ప్రదేశ్, కర్నాటక, కేరళ, మహారాష్ట్ర, మణిపూర్, మేఘాలయ, మిజోరమ్, ఒడిశా, పంజాబ్, తమిళనాడు, తెలంగాణ, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బంగాల్ సహా ప్రధాన వినియోగదారు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో చోటు చేసుకుంది.

అస్సాంలో కూడా ఇటీవలి వారాల్లో రిటైల్ ఉల్లి ధరలు దిగివచ్చాయి. సుమారు 12 కేంద్రాల్లో ఒక్కో కిలోకు ధరలో రూ.1 నుంచి రూ.8 వరకు తగ్గుదల కనిపించింది.

గత రెండు సంవత్సరాల్లో అస్సాంలో ఉల్లిగడ్డల సగటు చిల్లర ధరకు, అఖిల భారతీయ సగటు ధరకు మధ్య తేడా చాలా వరకు తగ్గింది. రెండు సంవత్సరాల కిందట అస్సాంలో సగటు చిల్లర ధర కిలోకు రూ.61.96 గా ఉంది. కాగా అఖిల భారతీయ సగటు ధర కిలోకు రూ.54.13 ఉంది. అంటే, ఒక్కో కిలోకు ధరలో రూ.7.83 తేడా ఉండేది. ప్రస్తుతం అస్సాంలో సగటు చిల్లర ధర కిలోకు రూ.54.30 ఉంది. దీంతో తేడా తగ్గిపోయి, ఒక్కో కిలోకు రూ.1.23కు పరిమితమైంది.

ఈ సమరూపత ప్రాంతీయ ధరలో వ్యత్యాసాన్ని చాలా వరకు తగ్గిపోవడాన్ని సూచిస్తున్నది. అస్సాంలో చిల్లర ఉల్లిగడ్డ ధరలు ప్రస్తుతం స్థూలంగా చూస్తే, జాతీయ సగటు ధరకు అనుగుణంగా ఉన్నాయి.

మార్కెట్టు పరిస్థితుల ఆధారంగా కొనసాగనున్న ఉల్లిపాయల బఫర్ స్టాకు పంపిణీ

దేశవ్యాప్తంగా ఉల్లి ధరలు, మార్కెట్టులోకి సరకు రాకడ, సరఫరా స్థితులపై ప్రభుత్వం నిరంతరాయంగా దృష్టి పెడుతోంది. మార్కెట్టు తాజా స్థితులు, ధరల ధోరణులతో పాటు లభ్యత అవసరాలను ప్రాతిపదికలుగా తీసుకొని ధరల స్థిరీకరణ నిధి (ప్రైస్ స్టెబిలైజేషన్ ఫండ్.. పీఎస్ఎఫ్) నుంచి ఉల్లి బఫర్ స్టాకు తరలింపులను చేపడుతున్నారు.

మార్కెట్టులో తగినంత లభ్యమయ్యేటట్లు పూచీ పడడానికి, ధరలలో అనుచిత హెచ్చుతగ్గులను అరికట్టడానికి, ఆమోదిత కార్యకలాపాల సంబంధిత నిర్ణయాల ప్రకారం అవసరాలను గమనించి ఉల్లి సరకును విడుదల చేయడాన్ని ఇక ముందూ కొనసాగించనున్నారు.

# ఆయుష్ రంగంలో నూతన ఆవిష్కరణల కారణంగా పేటెంట్ల దరఖాస్తుల్లో 8 రెట్ల వృద్ధి

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 17:ఆయుష్‌తో ముడిపడిన నూతన ఆవిష్కరణలు, మేధా సంపత్తి కార్యకలాపాల్లో గడచిన పది సంవత్సరాల్లో కీలక విస్తరణ చోటు చేసుకుంది. ఈ విషయాన్ని 11వ ఆయుర్వేద దినోత్సవాల సందర్భంగా ఆయుష్ సంబంధిత ఆవిష్కరణలపై విడుదల చేసిన ఒక నివేదికలో పేర్కొన్నారు. దీనిలో 2014-15 ఆర్థిక సంవత్సరం మొదలు 2025-26 ఆర్థిక సంవత్సరాల మధ్య కాలంలో పేటెంట్ల కోసం 4,077 దరఖాస్తులను సమర్పించగా, 711 పేటెంట్లను ఇచ్చారని ఈ నివేదికలో తెలియజేశారు.

నివేదికను కేంద్ర ప్రభుత్వ వాణిజ్య, పరిశ్రమల శాఖకు చెందిన పరిశ్రమ, అంతర్జాతీయ వాణిజ్య ప్రోత్సాహక విభాగం (డీపీఐఐటీ)లో ఓ భాగంగా ఉన్న పేటెంట్లు, డిజైన్లు, ట్రేడ్‌మార్కుల కంట్రోలర్ జనరల్ కార్యాలయం (సీజీపీడీటీఎమ్) ప్రచురించింది. ఈ నివేదిక భారతదేశంలో ఆయుష్‌కు సంబంధించిన ఆవిష్కరణలు, మేధా సంపత్తి కార్యకలాపాల పరిణామ క్రమం తాలూకు సంక్షిప్త వివరణను అందించింది.

ఆయుష్ శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర హోదా), ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీ ప్రతాప్‌రావ్ జాదవ్ మాట్లాడుతూ, "ఆయుష్‌కు సంబంధించిన పేటెంట్లను దాఖలు చేయడం, గ్రాంట్లలో చోటు చేసుకున్న కీలక వృద్ధి ఈ రంగంలో పరిశోధనలు, నూతన ఆవిష్కరణలు, మేధా సంపత్తిపై పెరుగుతున్న ఆసక్తిని చాటుతోంది. సాంప్రదాయిక జ్ఞ?నం, విజ్ఞ?నశాస్త్ర సంబంధిత పరిశోధనలు, సమకాలీన నూతన ఆవిష్కరణలు కలిసి నూతన ఉత్పాదనలు, సాంకేతికతలు, సేవలకు దోహదం చేసే ఓ విస్తారిత అనుబంధ వాతావరణాన్ని (ఇకోసిస్టమ్) ఏర్పరచడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. అలాగే భారత సుసంపన్న జ్ఞ?న వ్యవస్థలను సముచిత రీతిన పరిరక్షించేందుకు అనువైన వాతావరణాన్ని కూడా నెలకొల్పడానికి ప్రభుత్వం నిబద్ధతతో కృషి చేస్తుంది" అని పేర్కొన్నారు.

ఆయుష్ శాఖ కార్యదర్శి శ్రీ వైద్య రాజేశ్ కొటేచా మాట్లాడుతూ, " ఆయుష్ రంగంలో పరిశోధన, నూతన ఆవిష్కరణల పునాది అంతకంతకు బలపడుతోందని పేటెంట్ సంబంధిత కార్యకలాపాల్లో నిరంతర వృద్ధి చాటిచెబుతున్నది. వ్యక్తులు, విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థలు, అంకుర సంస్థలు, పరిశ్రమ.. వీటి అన్నిటి భాగస్వామ్యం పెంపొందుతుండడం ఉత్సాహకరం. పరిశోధనలను నూతన సేవలుగా మార్చడానికి ఈ ధోరణి సాయపడుతుంది. మంత్రిత్వ శాఖ ఆయుష్ రంగంలో ఫలితాలను రాబట్టడానికి, పరిశోధన ప్రధానమైన సహకారాన్ని అందించడానికి, నూతన ఆవిష్కరణలకు మద్దతు ఇవ్వడాన్ని కొనసాగిస్తుంది" అన్నారు.

నివేదికలో పేటెంట్లకు సంబంధించిన కార్యకలాపాల్లో గొప్ప వృద్ధి ఉన్నట్లు ప్రస్తావించారు. ఏటా దాఖలయ్యే దరఖాస్తులు 2014-15 ఆర్థిక సంవత్సరంలో 63గా ఉండగా, 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఇవి 590కి చేరాయి. ఇది సుమారు 836.5 శాతం వృద్ధిని సూచిస్తోంది. పేటెంట్ ఫైలింగులు 2022-23 ఆర్థిక సంవత్సరంలో గరిష్ఠ స్థాయిలో 606కు పెరిగాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో తగ్గి, 299కు పరిమితమయ్యాయి. అయితే 2025-26 ఆర్థిక సంవత్సరంలో మళ్లీ పెరిగి 590కి ఎగబాకాయి. వార్షిక పేటెంట్ గ్రాంట్లలోనూ చెప్పుకోదగిన వృద్ధి చోటు చేసుకుంది. ఇవి 2015-16 ఆర్థిక సంవత్సరంలో 3 వద్ద ఉండగా, 2023-24 ఆర్థిక సంవత్సరంలో 204కు పెరిగాయి.

కోవిడ్ అనంతర కాలంలో పేటెంట్ సంబంధిత కార్యకలాపాలు విశేషించి తీవ్ర వృద్ధిని కనబరిచాయి. 2020-21 ఆర్థిక సంవత్సరం మొదలు 2025-26 ఆర్థిక సంవత్సరం మధ్య 2,854 దరఖాస్తులు (ఇది మొత్తం దరఖాస్తుల్లో 70 శాతంగా లెక్కకు వస్తుంది) నమోదు అయ్యాయి. 2014-15 ఆర్థిక సంవత్సరం నుంచి 2019-20 ఆర్థిక సంవత్సరం మధ్య కాలంలో కేవలం 1,223 దరఖాస్తులు నమోదయ్యాయి. కోవిడ్ అనంతర కాలంలో 657 పేటెంట్లను ఇచ్చారు. ఇవి మొత్తం అందిన గ్రాంట్లలో 92.4 శాతంగా లెక్కకు వచ్చాయి.

# ఢిల్లీలో ఈ నెల 19న 2024, 2025 సంవత్సరాల ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ యువ పురస్కారాల ప్రదానం

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 17:2024, 2025 సంవత్సరాలకు సంబంధించిన ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ యువ పురస్కారాల ప్రదానోత్సవం 2026 అక్టోబర్ 19న ఉదయం 10 గంటలకు న్యూఢిల్లీలోని రవీంద్ర భవన్ ప్రాంగణంలో ఉన్న మేఘదూత్ కాంప్లెక్స్‌లో జరుగుతుంది. సంగీతం, నృత్యం, నాటక రంగాల్లో ప్రతిభ కనబరిచిన 106 మంది యువ కళాకారులకు కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి శ్రీ గజేంద్ర సింగ్ షెకావత్ ఈ పురస్కారాలను ప్రదానం చేస్తారు.

ఈ కార్యక్రమంలో కేంద్ర సాంస్కృతిక శాఖ కార్యదర్శి శ్రీ వివేక్ అగర్వాల్ ముఖ్య అతిథిగా పాల్గొంటారు. సంగీత నాటక అకాడమీ ఛైర్మన్ డాక్టర్ సంధ్యా పురేచా అధ్యక్షత వహిస్తారు.

40 ఏళ్లలోపు యువ కళాకారులను గుర్తించి ప్రోత్సహించేందుకు సంగీత నాటక అకాడమీ 2006లో ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ యువ పురస్కారాలను ప్రారంభించింది. అప్పటి నుంచి ఏటా ప్రత్యేక కార్యక్రమంలో యువ కళాకారులకు ఈ పురస్కారాలను ప్రదానం చేస్తున్నారు.

న్యూఢిల్లీలో 2026 మార్చి 22 నుంచి 26 వరకు జరిగిన సంగీత నాటక అకాడమీ జనరల్ కౌన్సిల్ సమావేశంలో 2024, 2025 సంవత్సరాలకు గానూ ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ యువ పురస్కారాల కోసం 106 మంది యువ కళాకారులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ యువ పురస్కారం కింద రూ.25,000 నగదు బహుమతితో పాటు తామ్రపత్రం, శాలువా అందజేస్తారు.

# కోర్టు రికార్డుల రూం ప్రారంభం



ఖమ్మం, అక్టోబర్ 17:ఖమ్మం జిల్లా మధిర కోర్టులో నూతనంగా నిర్మించిన రికార్డుల రూంను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి నూరేపల్లి నంద శనివారం ప్రారంభించారు. తొలిసారిగా మధిరకు వచ్చిన న్యాయమూర్తి నందకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి నాగరాజు, మధిర జూనియర్ సివిల్ జడ్జి దీప్తి వేముల మధిర బార్ అసోసియేషన్ అధ్యక్షులు చావలి రామరాజు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమెకు ఆలయ పూజారులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం మధిరలో అద్దె భవనం లో ఏర్పాటు చేసిన అదనపు కోర్టును ఆమె పరిశీలించారు. ఆమె వెంట పలువురు న్యాయమూర్తులు న్యాయవాదులు అధికారులు పాల్గొన్నారు.

# ప్రత్యేక ప్రచార కార్యక్రమం-6 ద్వారా డిజిటల్ పాలన, సేవల పంపిణీని బలోపేతం చేస్తున్న ఎస్ఈసీఎల్

న్యూఢిల్లీ, అక్టోబర్ 17:కేంద్ర బొగ్గు మంత్రిత్వశాఖ పరిధిలోని కోల్ ఇండియా లిమిటెడ్ అనుబంధ సంస్థ సౌత్ ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ (ఎస్ఈసీఎల్), హాస్పిటల్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (హెచ్ఎంఐఎస్), పీపీఓ, జీవన్ ప్రమాణ్ పత్ర పోర్టల్ ద్వారా డిజిటల్ పాలనను, పౌర కేంద్రీకృత సేవల పంపిణీని మరింత బలోపేతం చేస్తోంది. సులభతర సేవల లభ్యత, పరిపాలనా సామర్థ్యం, పారదర్శకత, కాగిత రహిత పాలనను ప్రోత్సహించే ప్రత్యేక ప్రచార కార్యక్రమం-6 లక్ష్యాలకు అనుగుణంగా ఈ కార్యక్రమాలున్నాయి.

వైద్యారోగ్య సేవల నిర్వహణకు సమగ్ర డిజిటల్ వేదికను ఎస్ఈసీఎల్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (హెచ్ఎంఐఎస్) అందిస్తుంది. రోగుల రిజిస్ట్రేషన్, వైద్య సంప్రదింపులు, చికిత్స, మందులకు సంబంధించిన సమాచారాన్ని డిజిటల్ రూపంలో నమోదు చేయటానికి ఈ వ్యవస్థ వీలు కల్పిస్తుంది. తద్వారా వైద్య రికార్డులను పద్ధతి ప్రకారం నిర్వహించటం, రోగుల గత వైద్య చికిత్సల వివరాలను సులభంగా తెలుసుకోవచ్చు.

అమృత్ ఫార్మసీ, మందుల నిర్వహణ అనుసంధానంతో పాటు.. మెడికల్ రీయింబర్స్‌మెంట్ క్లెయిమ్స్ ను ఆన్‌లైన్‌లో ప్రాసెస్ చేయటం కూడా హెచ్ఎంఐఎస్ వెసులుబాటు కల్పిస్తుంది. ఇది కాగిత రహిత పనిని ప్రోత్సహించేందుకు, పరిపాలనా ప్రక్రియలను క్రమబద్ధీకరించేందుకు, వైద్యారోగ్య సేవల పంపిణీని మెరుగుపరిచేందుకు సహాయపడుతుంది.

పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, మరణించిన ఉద్యోగుల జీవిత భాగస్వాముల కోసం పెన్షన్ పేమెంట్ ఆర్డర్ల (పీపీఓల) పంపిణీని డిజిటలైజ్ చేయటానికి, వార్షిక జీవన ప్రమాణ పత్రం సమర్పణను సులభతరం చేసేందుకు ఎస్ఈసీఎల్ సమగ్ర పీపీఓ, జీవన్ ప్రమాణ్ పత్ర పోర్టల్‌ను అభివృద్ధి చేసింది.

పెన్షనర్లు పీపీఓ పత్రాలను ఈ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో పొందవచ్చు. డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. వార్షిక జీవన ప్రమాణ పత్రాలను డిజిటల్ రూపంలో సమర్పించవచ్చు. స్వయంగా పత్రాల సమర్పణ, మాన్యువల్ ప్రక్రియలపై ఆధారపడటాన్ని ఇది తగ్గిస్తుంది.

ఎస్ఈసీఎల్ కార్యకలాపాలు సాగించే అన్ని ప్రాంతాల్లో పీపీఓల అప్‌లోడ్, నిబంధనల అమలు పర్యవేక్షణకు సమగ్ర గవర్నెన్స్ డ్యాష్‌బోర్డ్ తోడ్పడుతుంది. ఇది పారదర్శకతను, పరిపాలనా సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుంది.

పరిశుభ్రత, ఈ-వ్యర్థాల నిర్వహణ, స్థల సద్వినియోగం, రికార్డుల నిర్వహణ, పెండింగ్ పనుల తగ్గింపుపై 2026 అక్టోబర్ 2 నుంచి 31 వరకు జరిగే ప్రత్యేక ప్రచార కార్యక్రమం-6 అమలు దృష్టి సారిస్తుంది.

కాగిత రహిత పాలన, మెరుగైన సేవల లభ్యత, సమర్థవంతమైన రికార్డుల నిర్వహణ, వేగవంతమైన సేవల పంపిణీని ప్రోత్సహించటం ద్వారా ఎస్ఈసీఎల్ చేపట్టిన డిజిటల్ కార్యక్రమాలు ఈ లక్ష్యాలకు చేయూతనిస్తున్నాయి.

ఎస్ఈసీఎల్ డిజిటల్ పరివర్తనను, సుపరిపాలనను హెచ్ఎంఐఎస్, పీపీఓ, జీవన్ ప్రమాణ్ పత్ర పోర్టల్ ద్వారా ముందుకు తీసుకెళ్తూ.. ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబాలకు అత్యవసర సేవలను మరింత అందుబాటులోకి, సౌకర్యవంతంగా మారుస్తోంది.

# ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం



ఖమ్మం, అక్టోబర్ 17: వైరా నియోజకవర్గ కేంద్రంలోని కమ్మవారి కల్యాణ మండపంలో కమ్మ జన సేవా సమితి కాకతీయ కమ్యూనిటీ ఫౌండేషన్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఉచిత ఆరోగ్య శిబిరాన్ని కాకతీయ కమ్యూనిటీ ఫౌండేషన్ చైర్మన్ సత్యనారాయణ కమ్మ జన సేవా సమితి అధ్యక్షుడు కట్టా కృష్ణార్జునరావు ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ పట్టణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు బసవతారక ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ వారు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయటం జరిగిందని తెలిపారు. క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించి, బాధితులకు సకాలంలో వైద్య సేవలు అందించాలనే ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని కోరారు. ఉచిత వైద్య శిబిరానికి వందలాదిమంది ప్రజలు హాజరై వైద్య చికిత్సలు పొందారు .క్యాన్సర్ లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా, వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా చికిత్స మరింత సమర్థవంతంగా అందించే అవకాశం ఉంటుందని . శరీరంలో అసాధారణ మార్పులు కనిపించినప్పుడు వైద్యులను సంప్రదించాలని తెలిపారు .క్యాన్సర్‌పై అవగాహన పెంపొందించడంతో పాటు, వ్యాధి నిర్ధారణ పరీక్షలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అమ్మ జన సేవా సమితి అధ్యక్షుడు కట్టా కృష్ణార్జున రావు మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కాప చంద్రకళ మురళీకృష్ణ కమ్మ జన సేవా సమితి సభ్యులు చింతనిప్పురాంబాబు, వెంద రవెట్ల శ్రీనివాసరావు ,చావా శ్రీనివాసరావు , సూర్యదేవర శ్రీధర్, వాసిరెడ్డి రమేష్ ,ఏనుగు హనుమంతరావు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఏపీఈడీఏ సహకారంతో తమిళనాడు నుంచి బల్గేరియాకు 1.755 మెట్రిక్ టన్నుల సేంద్రియ తాటి బెల్లం పొడి ఎగుమతి

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 17:వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని భారత వ్యవసాయ, శుద్ధి చేసిన ఆహార ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి సంస్థ (ఏపీఈడీఏ) సహకారంతో తమిళనాడు ఈరోడ్ జిల్లాలో గల గోబిచెట్టిపాళయంలో తయారైన 1.755 మెట్రిక్ టన్నుల సేంద్రియ తాటి బెల్లం పొడి (పాల్మైరా బ్లాసమ్ నెక్టార్) బల్గేరియాలోని వార్నాకు తొలి ఎగుమతి ప్రారంభమైంది. భారత సేంద్రియ ఉత్పత్తుల జాతీయ కార్యక్రమం (ఎన్‌పీఓపీ), యూరోపియన్ యూనియన్ (ఈయూ) నుంచి ధ్రువీకరణలు లభించిన ఈ తాటి బెల్లం సరుకు ఎగుమతిని 2026 అక్టోబర్ 15న ప్రారంభించారు.

ఈ ఎగుమతి ద్వారా భారతీయ సంప్రదాయ తాటి ఆధారిత ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు పరిచయం చేయడంతో పాటు, దేశ సేంద్రియ ఉత్పత్తుల ఎగుమతుల పరిధిని విస్తరించే దిశగా కీలక ముందడుగు పడింది.

ఈ సరుకును ఈరోడ్‌కు చెందిన వెల్‌బీయింగ్ ఫుడ్స్ సంస్థ, చెన్నైకి చెందిన చెట్టి ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేటు లిమిటెడ్ సహకారంతో తయారు చేసి ఎగుమతి చేస్తున్నాయి. ఈ సరుకును చెన్నై నౌకాశ్రయం నుంచి సముద్ర మార్గంలో రవాణా చేయనున్నారు. బల్గేరియాకు చెందిన సౌ లైఫ్ లిమిటెడ్ ఈ సరుకును దిగుమతి చేసుకుని పంపిణీ చేయనుంది.

తమిళనాడులో సంప్రదాయ తాటి ఆధారిత ఉత్పత్తులకు మార్కెట్ అవకాశాలను బలోపేతం చేయడం, సేంద్రియ సాగులో నిమగ్నమైన ఉత్పత్తిదారులకు కొత్త అవకాశాలు కల్పించడం ఈ కార్యక్రమం లక్ష్యం. ఈ కార్యక్రమం కింద 137 ఎకరాల్లో సేంద్రియ సాగు చేపడుతున్నారు. మెరుగైన మార్కెట్ అందుబాటు, ఎగుమతులకు అనుగుణమైన సరఫరా వ్యవస్థల ద్వారా రైతులకు ప్రయోజనం చేకూరుతుందని భావిస్తున్నారు. దేశీయ మార్కెట్‌తో పోలిస్తే, రైతులకు లభించే ధర సుమారు 15?22 శాతం మేర, తయారీదారుకు లభించే ధర 17 శాతం అధికంగా ఉన్నట్లు నివేదించారు. దీనివల్ల ఈ కార్యక్రమంలో పాల్గొనే రైతులకు మెరుగైన ఆదాయం పొందే అవకాశం లభించడంతో పాటు, స్థిరమైన జీవనోపాధికి తోడ్పాటు అందుతుంది.

తాటి పువ్వుల మకరందం నుంచి సేకరించిన తేనె వంటి తాటి బెల్లం పొడి సంప్రదాయ భారతీయ తీపి పదార్థం. దీనికి విలువ ఆధారిత ఉత్పత్తులుగా అభివృద్ధి చేసే అవకాశం ఉండటంతో పాటు, అంతర్జాతీయ మార్కెట్లలో విస్తృత ఆదరణ పొందే అవకాశముంది. శుద్ధి చేసిన చక్కెరకు ప్రత్యామ్నాయంగా ఉపయోగించగల ఈ ఉత్పత్తిలో విటమిన్లు, ఖనిజాలు వంటి పోషకాలు లభించే అవకాశం ఉంది.

తాటి ఆధారిత ఉత్పత్తులు సంప్రదాయ తయారీ పద్ధతులతో ముడిపడి ఉన్నాయి. తమిళనాడు వ్యవసాయ, సాంస్కృతిక జీవనంలో తాటిచెట్టుకు ఎంతోకాలంగా ప్రత్యేక స్థానం ఉంది. ఈ వనరుతో ఎగుమతులకు అనువైన ఉత్పత్తులను అభివృద్ధి చేయడం ద్వారా మార్కెట్ అవకాశాలను విస్తరించడంతో పాటు, ఉత్పత్తిదారులు, ఈ రంగానికి సంబంధించిన సరఫరా వ్యవస్థకు మద్దతు కల్పించవచ్చు.

ఏపీఈడీఏ ఛైర్మన్ శ్రీ అభిషేక్ దేవ్ ఈ ఎగుమతి సరుకు రవాణాను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏపీఈడీఏ కార్యదర్శి డాక్టర్ సస్వతి బోస్, ఆ సంస్థకు చెందిన ఉన్నతాధికారులు, ఎగుమతి సంస్థల ప్రతినిధులు, అంతర్జాతీయ భాగస్వాములు, ప్రగతిశీల వరి రైతులు, ఎగుమతి సరఫరా వ్యవస్థకు సంబంధించిన ఇతర భాగస్వాములు పాల్గొన్నారు. భారత వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులను బలోపేతం చేయడంలో వివిధ వర్గాల మధ్య ఉన్న సహకారాన్ని ఈ కార్యక్రమం ప్రతిబింబించింది.

# ఘనంగా కుంకుమ పూజలు



ఖమ్మం, అక్టోబర్ 17:శరన్నవరాత్రి మహోత్సవాల్లో ఏడవ రోజున శ్రీ మహాలక్ష్మి దేవిగా అమ్మవారు భక్తులకుదర్శనమిచ్చారు నవరాత్రులో భాగంగా కోదండ రామాలయంలో మహాలక్ష్మి అలంకారం రోజున హిరణ్యాభిషేకం పుష్పాభిషేకం నిర్వహించారు.

మంగళప్రదమైన దేవత మహాలక్ష్మి దేవి మహాకాళి మహాలక్ష్మి మహా సరస్వతి రూపాలు ధరించి ఆదిపరాశక్తి దృక్షరాక్షస సంవారనీ చేసిందని క్షీరాబ్ధి పుత్రికగా అవతరించిన లక్ష్మీదేవి డోలాస్రుని రాక్షసుడి సంహరించిందని పురాణాలు చెబుతున్నాయి. ఆశ్వీజ సప్తమి దేవి నవరాత్రి ఉత్సవాల లో భాగంగా శనివారంమండల వ్యాప్తంగా దుర్గాదేవి మండపాల వద్ద కుంకుమ పూజలు నిర్వహించారు. కోదండ రామాలయం, సాయిబాబా మందిరంలో ప్రతిష్టించిన అమ్మవారి మండపం ఎదుట కమిటీ వారి ఆధ్వర్యంలో మహిళలకు కుంకుమ పూజలు నిర్వహించారు. మండపం వద్ద ఏర్పాటుచేసిన కుంకుమ పూజలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు కుంకుమపూజ సామాగ్రిని ఉత్సవ కమిటీ వారు అందించారు. అనంతరం అమ్మవారికి మహిళలు పూజలు నిర్వహించారు. మంత్రపుష్పం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. సాయంత్రం సాయి బాబా మంది రం లో ఉత్తమ బతకములకు వైరా లయన్స్ క్లబ్ అవని బహుమతులను అందజేస్తుందని ఉత్సవ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

# కార్వార్‌లో భారత నౌకాదళ తొలి స్వదేశీ బహుళ ప్రయోజక నౌక ఐఎన్ఎస్ సమర్థక్‌ను నౌకాదళంలోకి ప్రవేశపెట్టిన ఉపరాష్ట్రపతి శ్రీ సీపీ రాధాకృష్ణన్

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 17:కర్ణాటకలోని కార్వార్‌లో భారత నౌకాదళ తొలి స్వదేశీ బహుళ ప్రయోజక నౌక ఐఎన్ఎస్ సమర్థక్‌ను భారత ఉపరాష్ట్రపతి శ్రీ సీపీ రాధాకృష్ణన్ ఇవాళ ప్రారంభించారు. రక్షణ రంగ తయారీలో స్వావలంబన దిశగా, అత్యాధునిక స్వదేశీ నౌకాదళ సామర్థ్యాల అభివృద్ధి దిశగా భారత్ సాగిస్తున్న ప్రయాణంలో ఈ నౌక ప్రారంభం కీలక ఘట్టాన్ని సూచిస్తుంది.

ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ.. 75 శాతానికిపైగా స్వదేశీ పరిజ్ఞానం, సామగ్రితో ఐఎన్ఎస్ సమర్థక్ ను రూపొందించినట్లు చెప్పారు. ఇది పెరుగుతున్న భారత పారిశ్రామిక, సాంకేతిక, నౌకా నిర్మాణ సామర్థ్యాలను ప్రతిబింబిస్తోందని అన్నారు. రక్షణ రంగంలో స్వావలంబన ఇప్పుడు కేవలం ఆకాంక్ష మాత్రమే కాదని, అది వాస్తవ రూపం దాల్చుతున్నట్లు తెలిపారు. ఇది భారత వ్యూహాత్మక స్వయంప్రతిపత్తికి, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 'వికసిత్ భారత్, ఆత్మనిర్భర్ భారత్' దార్శనికతకు దోహదపడుతుందని తెలిపారు.

భారతదేశ సుసంపన్న సముద్ర వారసత్వాన్ని ప్రస్తావిస్తూ.. హిందూ మహాసముద్రం, ఆగ్నేయాసియా వ్యాప్తంగా భారత సముద్రజలాల ప్రభావాన్ని విస్తరించిన ఛత్రపతి శివాజీ మహారాజ్, చోళ రాజవంశపు నౌకాదళ సంప్రదాయాలను శ్రీ సీపీ రాధాకృష్ణన్ గుర్తు చేశారు.

జాతీయ సార్వభౌమాధికారాన్ని, సముద్ర జలాల ప్రయోజనాలను కాపాడటంలో విశిష్ట సేవలందిస్తున్న భారత నౌకాదళాన్ని ఉపరాష్ట్రపతి ప్రశంసించారు. సముద్రపు దొంగలను నియంత్రించే ఆపరేషన్లు, భారత పౌరుల తరలింపు, మానవతా సాయం, విపత్తు సహాయక చర్యలతో సహా హిందూ మహాసముద్ర ప్రాంతంలో తక్షణమే స్పందించే, విశ్వసనీయ భద్రతా భాగస్వామిగా నౌకాదళ పాత్రను అభినందించారు.

ఐఎన్ఎస్ సమర్థక్ ప్రాముఖ్యతను వివరిస్తూ.. తదుపరితరం ఆయుధాలు, సెన్సార్లు, అత్యాధునిక సాంకేతికతల పరీక్షలు, విశ్లేషణకు ఈ నౌక బహుముఖ వేదికగా ఉపయోగపడుతుందని ఉపరాష్ట్రపతి తెలిపారు. సముద్ర నిఘా, పరిశీలన, తీరప్రాంత గస్తీ, లక్ష్యాలను ప్రయోగించటం, ఫలితాలను పొందటం, మానవరహిత వ్యవస్థలతో కూడిన ఆపరేషన్లు, మానవతా సాయం, విపత్తు సహాయక చర్యలకు కూడా దీని సామర్థ్యాలు మద్దతునిస్తాయని చెప్పారు. ఇలాంటి వేదిక వల్ల నూతన సాంకేతిక పరిణామాలను నౌకాదళం మరింత వేగంగా అందిపుచ్చుకునేందుకు, స్వదేశీ ఆవిష్కరణలను ఆచరణాత్మక సామర్థ్యాలుగా మార్చుకునేందుకు వీలుంటుందని అన్నారు.

కార్వార్ వ్యూహాత్మక ప్రాముఖ్యతను ప్రస్తావిస్తూ... సహజంగానే ఉన్న లోతైన నౌకాశ్రయం, అరేబియా సముద్రానికి సమీపంలో ఉండటం వల్ల భారత సముద్ర భద్రతా వ్యవస్థలో ఇది అత్యంత కీలక భాగమని శ్రీ సీపీ రాధాకృష్ణన్ అన్నారు. ప్రాజెక్టు సీబర్డ్ ద్వారా కొనసాగుతున్న ఆధునిక నౌకాదళ మౌలిక సదుపాయాల అభివృద్ధిని ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ ప్రాంతంలో విస్తృత ఆర్థిక అవకాశాలను సృష్టిస్తూనే నౌకలు, జలాంతర్గాములను నిలిపేందుకు, నిర్వహించేందుకు ఇది నౌకాదళ సామర్థ్యాన్ని పెంచుతుందని తెలిపారు.

రక్షణ తయారీ వ్యవస్థను బలోపేతం చేయటంలో భారత నౌకాదళం, రక్షణ ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రైవేట్ షిప్‌యార్డులు, డీఆర్‌డీఓ, విద్యా సంస్థలు, ఎంఎస్ఎంఈలు, అంకుర సంస్థల మధ్య పెరుగుతున్న భాగస్వామ్యాన్ని ఉపరాష్ట్రపతి తెలిపారు. ఈ ప్రాజెక్టులో లార్సెన్ అండ్ టూబ్రో (ఎల్‌డటీ) అందించిన సహకారాన్ని ప్రశంసిస్తూ.. స్వదేశీ నౌకాదళ సామర్థ్యాల నిర్మాణంలో నేవీ విభాగ డిజైనర్లు, ఉత్పత్తి విభాగాల అధికారులు, షిప్‌యార్డ్ నిపుణులు, ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులు, సరఫరాదారులు, అనుబంధ పరిశ్రమల కృషిని ఆయన అభినందించారు.

ఈ కార్యక్రమంలో నౌకాదళ ప్రధానాధికారి అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్, ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్, వైస్-అడ్మిరల్ సంజయ్ వాత్సాయన్, కంట్రోలర్ వార్‌షిప్ ప్రొడక్షన్ అండ్ అక్విజిషన్ వైస్-అడ్మిరల్ సంజయ్ సాధు, ఫ్లాగ్ ఆఫీసర్ (కర్ణాటక), రియర్ అడ్మిరల్ విక్రమ్ మీనన్, ఎల్ అండ్ టీ షిప్‌బిల్డింగ్ విభాగాధిపతి రిటైర్డ్ రియర్ అడ్మిరల్ జీ.కే. హరీశ్, ఐఎన్ఎస్ సమర్థక్ కమాండింగ్ ఆఫీసర్ కమాండర్ సుశీల్ కుమార్ సింగ్, భారత నౌకాదళం, రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన సీనియర్ అధికారులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# ఆపదలో అండగా ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

**రూ.2.50 లక్షల సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ మంజూరు**

నల్గొండ, అక్టోబర్ 17:మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మరోసారి మానవత్వం చాటుకున్నారు. మునుగోడు పట్టణానికి చెందిన కొమ్ము పద్మ అనారోగ్యంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. తదుపరి వైద్య చికిత్సకు ఆర్థిక ఇబ్బందులు ఎదురుకావడంతో స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యేను ఆశ్రయించారు.

ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వెంటనే స్పందించి, ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి రూ.2,50,000 విలువైన ఎల్ఓసీని మంజూరు చేయించారు.

అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న బాధితురాలికి అండగా నిలిచి, వైద్య ఖర్చుల కోసం సీఎంఆర్ఎఫ్ నిధులు మంజూరు చేయించడంపై పద్మ కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నల్లగొండ జిల్లా మాజీ అధ్యక్షుడు పాల్వాయి జితేందర్‌రెడ్డి, మండల పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి టీజీ భరత్‌తో మేయర్ అభ్యర్థి విజయ ప్రత్యూష భేటీ

**కర్నూలు రాజకీయ పరిస్థితులు, ఎన్నికల ప్రచార వ్యూహాలపై చర్చ**



అమరావతి, అక్టోబర్ 17: కర్నూలు నగరపాలక సంస్థ మేయర్ అభ్యర్థిగా టీడీపీ ప్రకటించిన విజయ ప్రత్యూష మంత్రి టీజీ భరత్‌ను ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా కర్నూలు నగరంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ఎన్నికల ప్రచార వ్యూహాలపై ఇరువురూ చర్చించారు.

కూటమి అభ్యర్థుల విజయానికి చేపట్టాల్సిన కార్యాచరణ, ప్రచారాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే అంశాలపై సమాలోచనలు జరిపారు. నగరంలో కూటమి బలాన్ని మరింత పెంచుకుంటూ, అన్ని స్థానాల్లో మెరుగైన ఫలితాలు సాధించే దిశగా సమష్టిగా కృషి చేయాలని చర్చించినట్లు తెలిసింది.

ఎన్నికల్లో విజయం సాధించేలా పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి టీజీ భరత్ సూచించారు.

# గల్ఫ్ కార్మికుడి కుటుంబానికి భరోసా

**బాధిత కుటుంబానికి రూ.1.20 లక్షల సాయం**




హైదరాబాద్, అక్టోబర్ 17: ఖతార్‌లో మృతి చెందిన గల్ఫ్ కార్మికుడి కుటుంబానికి తెలంగాణ గల్ఫ్ సమితి అండగా నిలిచింది. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం నడికుడ గ్రామానికి చెందిన తలారి ముత్తన్న (55) ఖతార్‌లో అనారోగ్యంతో మృతి చెందారు.

విషయం తెలుసుకున్న గల్ఫ్ సమితి ప్రతినిధులు మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించేందుకు కృషి చేశారు. బాధిత కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకుని ఖతార్ లోని తెలుగు సోదరుల సహకారంతో రూ.1.20 లక్షల ఆర్థిక సాయాన్ని శనివారం అందజేశారు. సమితి సభ్యుడు అందుగుల రాకేష్ యాదవ్ గ్రామస్తుల సమక్షంలో సాయాన్ని కుటుంబానికి అందజేశారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా అందేలా కృషి చేస్తామని తెలిపారు.

# గోపిరెడ్డి నగర్‌లో బతుకమ్మ ఆట.. పాట



నల్గొండ, అక్టోబర్ 17:పట్నంలోని గోపిరెడ్డి నగర్ లో ఏడవ రోజు బతుకమ్మను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ ఎర్నేని కుసుమ వెంకట్ రత్నం బాబు, ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబురాలు కోదాడ పట్టణం గోపిరెడ్డి నగర్ లో ఘనంగా ఏర్పాటు చేశారు.

గోపిరెడ్డి నగర్ బతుకమ్మ కమిటీ నిర్వహించిన వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ ఎర్నేని కుసుమ వెంకట్ రత్నం బాబు, మహిళా మండలి అధ్యక్షురాలు నూనె సులోచన మాట్లాడుతూ. ప్రకృతిలో లభించే రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి గౌరమ్మను పూజించడం తెలంగాణ ప్రత్యేకతని, బతుకమ్మ ఆటలు, పాటలు మహిళల ఐక్యతకు, ఆత్మగౌరవానికి ప్రతీకలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. 'మా ఇంటి ఇలవేల్పు గౌరమ్మ రావమ్మా' అంటూ బతుకమ్మ పాటలతో మహిళలు సంప్రదాయ వేడుకలకు శ్రీకారం చుట్టారు. తంగేడు, గునుగు, బంతి తదితర పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి, సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. తొమ్మిది రోజులపాటు జరిగే బతుకమ్మ వేడుకలు తెలంగాణ సంస్కృతి వైభవాన్ని చాటుతూ, ప్రకృతి ఆరాధనతో పాటు కుటుంబ సుఖసంతోషాలు, సామాజిక ఐక్యతను పెంపొందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ తుమ్మల నాగేంద్రమ్మ , గంధం బాలేంద్ర పండు, వంగూరు గోపి, కాంగ్రెస్ నాయకులు రావెళ్ల కృష్ణారావు ఎర్నేని నిర్మల మేదర లలిత తదితరులు పాల్గొన్నారు.

# వాకర్స్ సంక్షేమానికి కట్టుబడి ఉన్నా..

**జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్**

జగిత్యాల ప్రతినిధి, ఆంధ్రప్రభ : వాకర్స్ సంక్షేమానికి తాను ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అన్నారు. శనివారం ధరూర్ క్యాంప్ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే, నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. సంజయ్ మాటాడుతూ ఎస్కెఎన్ఆర్ వివేకానంద మినీ స్టేడియం, ధరూర్ క్యాంప్ గ్రౌండ్ లో వాకర్స్ కు అవసరమైన వసతులు కల్పిస్తామని, ఇప్పటికే ఓపెన్ జిమ్ లు ఏర్పాటు చేశామన్నారు. రోజూ వాకింగ్ తో మెరుగైన ఆరోగ్యం సాధ్యమన్నారు. రామాలయం నుంచి కజ్మీర్ రోడ్డు వరకు రూ.కోటితో డ్రైనేజీ పనులు చేపట్టామని, రామాలయం ట్రాక్ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ప్రశాంత్ రావు, నూతన అధ్యక్షుడు గాడిపెల్లి చంద్రశేఖర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి దేవనపల్లి సత్యనారాయణ, అసోసియేషన్ సభ్యులు, వాకర్స్ తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డిగూడ గ్రామ సర్వేకు గ్రామసభ తీర్మానం

హైదరాబాద్, అక్టోబర్ 17:: వికారాబాద్ మండలం కామారెడ్డిగూడలో సర్వే నిర్వహించుటకు గ్రామసభ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. గ్రామ సర్పంచ్ శంకరమ్మ అధ్యక్షతన నిర్వహించిన గ్రామస్తులు డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ గౌడ్ పాల్గొనగా ఉపసర్పంచ్ జి శివరాజ్ గౌడ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ శంకరమ్మ ఉప సర్పంచ్ జి శివరాజ్ గౌడ్ మాట్లాడుతూ.. గ్రామంలో సర్వే నిర్వహించడానికి గ్రామస్తులందరి విజ్ఞప్తి మేరకు సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గ్రామంలో సర్వే నిర్వహించాలన్న తీర్మానం మంచిదని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎమ్మార్ఓ శ్రీనివాస్ గౌడ్ పాల్గొని వివరించారు. సర్పంచ్ శంకరమ్మ ఉప సర్పంచ్ శివరాజ్ గౌడ్ గారు వార్డ్ మెంబర్ లు గోవర్ధన్ రెడ్డి , అనిల్, రేణుక, సారమ్మ, అన్నపూర్ణ, మారియు మాజీ సర్పంచ్ పురుషోత్తం రెడ్డి, గ్రామ పెద్దలు అమరేందర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, మహేందర్ రెడ్డి , చిన్నరాజు, జంగయ్య రైతులు పాల్గొన్నారు

# 13 కోట్ల ఓట్లను తొలగించారు.. మోదీ సర్కార్‌పై మధుయాష్కీ ఆరోపణలు

హైదరాబాద్, అక్టోబర్ 17: ప్రస్తుతం భారతదేశం అత్యంత ప్రమాదకరమైన పరిస్థితిలో ఉందని.. అందరూ కలిసి కట్టుగా పోరాటం చేయాలని ఏఐసీసీ ప్రొఫెషనల్ కాంగ్రెస్ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ అన్నారు. ఈరోజు(శనివారం) మీడియాతో మాట్లాడుతూ.. 2014లో మోదీ ప్రధాని అయ్యాక రాజ్యాంగానికి ప్రమాదం ఏర్పడిందని వ్యాఖ్యానించారు. రాజ్యాంగ రక్షణ కోసం 2017లో రాహుల్ గాంధీ ప్రొఫెషనల్ కాంగ్రెస్‌ను ఏర్పాటు చేశారని తెలిపారు. రాజ్యాంగాన్ని రక్షించాలంటే ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ పాత్ర కీలకమని చెప్పుకొచ్చారు. ఇతర పార్టీలో ఉన్న వారు కూడా ప్రొఫెషనల్ కాంగ్రెస్‌లో భాగం పంచుకోవచ్చని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ సభ్యత్వంలేని వారు కూడా రాజ్యాంగ పరిరక్షణ కోసం పని చేయొచ్చని అన్నారు.

దేశంలో 'సర్' ద్వారా 13 కోట్ల ఓట్లను మోదీ ప్రభుత్వం తొలగించిందని మధుయాష్కీ ఆరోపించారు. 13 కోట్ల ఓట్లలో ఎక్కువ మంది దళితులు, ఆదివాసీలు, మైనారిటీల ఓట్లు ఉన్నాయన్నారు. తొలగించిన 13 కోట్ల ఓట్లు ఆధారాలతో బయటపెట్టామని అన్నారు. సాఎఖీపై పోరాటం కాంగ్రెస్ భవిష్యత్తు కోసం కాదని.. దేశ ప్రజల భవిష్యత్తు కోసమని స్పష్టం చేశారు. బీజేపీ మోదీ ప్రభుత్వం పౌరుల స్వేచ్ఛను కాలరాస్తోందని విమర్శించారు. క్లిష్ట సమయంలో తనకు అప్పజెప్పిన ప్రొఫెషనల్ కాంగ్రెస్ చైర్మన్ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు.

మన్మోహన్ సింగ్ ఫెలోషిప్ ద్వారా వివిధ రంగాల్లో వచ్చిన నిష్ణాతులైన 50 మందికి ఒక సంవత్సరం పాటు ట్రైనింగ్ ఇచ్చారని మధుయాష్కీ తెలిపారు. రెండో దఫా 800 అప్లికేషన్స్ వచ్చాయని.. 100 మందికి శిక్షణ ఇవ్వడం జరిగిందని చెప్పారు. బారిస్టర్లు, లాయర్లు, డాక్టర్లతో ప్రొఫెషనల్ కాంగ్రెస్ ఏర్పడిందన్నారు. భారత పౌరులకు రక్షణ కల్పించేది రాజ్యాంగమన్నారు. ప్రొఫెషనల్స్‌కు క్రెడిబులిటి ఉండాలని రాహుల్ గాంధీ ఆకాంక్ష అని చెప్పుకొచ్చారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకరావడంలో ప్రొఫెషనల్స్ కీలక పాత్ర పోషించినట్లు తెలిపారు. ఇప్పుడున్న క్లిష్ట పరిస్థితుల కోసం ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ పని చేస్తోందన్నారు. ప్రజలకు, ప్రతి పౌరుడికి గౌరవ ప్రదమైన జీవితం అందించడానికి ప్రొఫెషనల్ కాంగ్రెస్ ప్రయత్నం చేస్తుందని తెలిపారు. నిష్ణాతులతో ప్రొఫెషనల్ కాంగ్రెస్ కమిటీ ఏర్పాటు చేశామని మధుయాష్కీ గౌడ్ పేర్కొన్నారు

# సోయాబీన్ కొనుగోళ్లు సక్రమంగా చేపట్టాలి : ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఆదిలాబాద్, అక్టోబర్ 17: ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండల కేంద్రం శనివారం సోయబిన్ కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో తెలంగాణ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సోయాబీన్ కొనుగోలు కేంద్రాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా రైతులు తమ సోయాబీన్ పంటను కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి విక్రయించుకోవాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యవసాయ మార్కెట్ అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# సమస్యాత్మక ప్రాంతాల్లో డ్రోన్ల నిఘా!

**సున్నిత, అతి సున్నిత పోలింగ్ కేంద్రాల గుర్తింపు**

**మొబైల్ బృందాలు, స్ట్రైకింగ్ ఫోర్స్‌లతో బందోబస్తు**

**అదనపు బలగాల మోహరింపునకు సిద్ధం: ఐజీ రాజకుమారి**

విజయవాడ, అక్టోబర్ 17: ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసు శాఖ అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటోందని ఐజీ రాజకుమారి తెలిపారు. రాష్ట్ర డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు జిల్లాల ఎస్పీలను అప్రమత్తం చేసినట్లు వెల్లడించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు.

ఎన్నికల నేపథ్యంలో చేపట్టిన ముందస్తు చర్యల్లో భాగంగా జిల్లాల వారీగా పోలింగ్ కేంద్రాల సున్నితత్వాన్ని అంచనా వేస్తున్నట్లు ఐజీ తెలిపారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించి అతి సున్నిత, సున్నిత, సాధారణ పోలింగ్ కేంద్రాలుగా విభజిస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఆయా కేంద్రాల్లో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

ఎన్నికల సమయంలో పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు పోలీసు బందోబస్తుతోపాటు మొబైల్ పార్టీలు, స్ట్రైకింగ్ ఫోర్స్‌లు, ప్రత్యేక స్ట్రైకింగ్ ఫోర్స్‌లు, రూట్ మొబైల్ బృందాలను రంగంలోకి దించుతున్నట్లు రాజకుమారి వెల్లడించారు. అవసరాన్ని బట్టి అదనపు పోలీసు బలగాలను కూడా మోహరిస్తామని తెలిపారు.

నామినేషన్ కేంద్రాలతోపాటు సమస్యాత్మక ప్రాంతాల్లో నిరంతర నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు ఐజీ చెప్పారు. అవసరమైన చోట్ల వీడియో చిత్రీకరణ, సీసీటీవీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ చేపడుతున్నట్లు వివరించారు. నామినేషన్ కేంద్రాలు, సమస్యాత్మక ప్రాంతాల్లో డ్రోన్లను కూడా వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు.

రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పోలీసు శాఖ చర్యలు చేపడుతోందని రాజకుమారి తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.

# గద్వాల జిల్లాలో రైస్ మిల్లులపై విజిలెన్స్ అధికారుల దాడులు

జోగులాంబ గద్వాల , అక్టోబర్ 17: ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో గత రెండు రోజులుగా రైస్ మిల్లుల పై విజిలెన్స్ అధికారుల దాడులు కొనసాగుతున్నాయి. తాజాగా శనివారం గద్వాల జిల్లాలో దాడులు కొనసాగాయి. కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ధాన్యం నిల్వలు, బియ్యం అప్పగింతల్లో భారీగా అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు రావడంతో అధికారులు తనిఖీలు చేపట్టినట్లు సమాచారం.కోట్ల రూపాయల విలువైన సీఎంఆర్ ధాన్యం మాయమైనట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో విజిలెన్స్ అధికారులు ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు సమాచారం. జిల్లాలోని పలు మిల్లుల్లో ధాన్యం నిల్వలు, రికార్డులు, ప్రభుత్వానికి అప్పగించాల్సిన బియ్యం వివరాలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.విజిలెన్స్ దాడుల నేపథ్యంలో కొందరు మిల్లు యజమానులు అందుబాటులో లేకుండా పోయినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే తనిఖీల్లో వెల్లడయ్యే వాస్తవాలు, ధాన్యం నిల్వల్లో తేడాలు, బాధ్యులపై తీసుకునే చర్యలపై స్పష్టత రావాల్సి ఉంది. విజిలెన్స్ తనిఖీలతో రైస్ మిల్లుల వర్గాల్లో కలకలం నెలకొంది. అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేపడితే సీఎంఆర్ వ్యవహారంలో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.



# థామస్ ఎడిసన్ ఆవిష్కరణల వెనక తల్లి పాత్ర

### అక్టోబర్ 18...థామస్ అల్వా ఎడిసన్ వర్ధంతి



నూతన ప్రఖ్యాత శాస్త్రవేత్త థామస్ అల్వా ఎడిసన్ జీవితంలో ఎన్నో ఆవిష్కరణలు గావించాడు. ఆయన అసమాన కృషి వెనక కన్న తల్లి పాత్ర గురించి తెలిస్తే ఆశ్చర్యం కలుగ మానదు.

ఎడిసన్ బాల్యంలో ఆయన తల్లి నిజాన్ని దాచి, ముద్దుల కుమారునికి ఇచ్చిన స్ఫూర్తి ఆయనకు తెలియకుండానే ప్రపంచంలో ఒక గొప్ప శాస్త్ర వేత్తను చేయడానికి ఉపకరిం చింది.

ఎడిసన్ పాఠశాల నుండి ఒక రోజు ఇంటికి వచ్చి, తనకు స్కూల్లో ఇచ్చిన ఒక లెటర్ ను తల్లికి ఇచ్చి... దానిని స్కూలు లో తనకు ఇచ్చారని, తల్లికి ఇమ్మన న్నారని చెప్పి, దానిలో ఏముందో చదవి వినిపించమన్నాడు. తల్లి ఆ లెటర్‌ను తెరిచి, చదువుతూ కళ్ళ నీళ్ళ పర్యంత మయింది. తన కుమారుడిని అక్కున చేర్చుకొని ఏడ్చింది. విషయం అర్థం కాని థామస్.. లెటర్ లో ఏముందని అడిగాడు. ఆమె ఆ లెటర్‌ను పట్టుకుని బిగ్గరగా చదువుతూ... "మీ కుమారుడు ఒక జీనియస్, అద్భుతమైన తెలివి తేటలు కలిగిన వాడు , అయితే మేము ఇటువంటి కుర్రాడికి మా స్కూలులో చదువు చెప్పలేము, ఇక్కడ థామస్‌కు చదువు చెప్పడానికి సరైన ఉపాధ్యాయులు లేక పోవడమే దానికి కారణం. అందుకే థామస్‌కు మీరు ఇంట్లోనే చదువు చెప్పండి" అని రాశారు అంటూ ఆమె చదివి చెప్పింది.

నాటి నుండి థామస్ ఇంట్లోనే తన తల్లి వద్ద చదువు కోగా... తల్లి థామస్ చదువుపై అపార శ్రద్ధ పెట్టి ఒక గొప్ప మేధావిగా తీర్చిదిద్దింది. అలా తల్లి ప్రోత్సాహం, మార్గదర్శకత్వంలో స్వయం కృషితో థామస్ ఎడిసన్ ప్రపంచంలోనే గొప్ప ఆవిష్కర్తగా రూపు దిద్దు కున్నాడు. మానవ జాతిని ప్రభావితం చేసిన విద్యుత్ బల్బు, ఫోనోగ్రాఫ్ లాంటి అనేక ఉపకరణాలను రూపొందించిన ఒక గొప్ప శాస్త్రవేత్తగా చరిత్రలో మిగిలాడు.

థామస్ ఎడిసన్ ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేక రైళ్ళలో న్యూస్ పేపర్లు, స్వీట్లు అమ్మేవాడు. అతి చిన్న వయస్సు లోనే టెలిగ్రాఫ్ నమూనా యంత్రాన్ని తయారు చేశాడు. 1861 లో ఎడిసన్ "గ్రాంట్ ట్రంక్ హెరాల్డ్" అనే సాధారణ న్యూస్ పేపర్ నడిపాడు. 1862 లో ఎడిసన్ ఒక స్టేషను మాష్టర్ బిడ్డను ప్రమాదం నుంచి రక్షించి ప్రతిఫలంగా ఆయన వద్ద నుంచి టెలీగ్రఫీని నేర్చుకున్నాడు...తన టెలిగ్రాఫ్ పరికరాన్ని పరిస్థి తుల కారణంగా విధిలేక అమ్ము కున్నాడు.

1878 లో ఎలక్ట్రిక్ బల్బ్ ను 1877 లో ఫోనోగ్రాఫ్ ను, 1887-1889 మధ్య లో టైప్ రైటర్ , ఎలక్ట్రిక్ పెన్ , గ్రామ ఫోన్ , మోషన్ పిక్చర్ కెమేరా , తదితర ఎన్నింటినో ఆయన ఆవిష్కరించాడు. అక్టోబరు 18 1931న మరణించాడు.

థామస్ పేరు ప్రతిష్టలు గడుస్తున్న సమయంలోనే ఆయన తల్లి మరణించింది.

ఒకరోజు థామస్ తన ఇంట్లోని పాత వస్తువులు తొలగించే పనిలో .. బీరువాలో ఒక లెటర్ కనిపించింది.

అది తాను పాఠశాలలో చదువుకుంటున్న రోజుల్లో ఉపాధ్యాయులు తనకు ఇచ్చిన లెటర్ గా గుర్తిం చాడు.

ఆ లెటర్ చదివిన థామస్ ఒక్కసారిగా షాక్ కు గురైనాడు.

ఇంతకీ ఆ లెటర్ లో ఏముం దంటే 'మీ కుమారుడు థామస్ మానసికంగా చాలా బలహీనుడు. ఇలాంటి కుర్రాడికి మా స్కూలులో చదువు చెప్పలేం.

దయచేసి మీ అబ్బాయికి మీ ఇంట్లోనే చదువు నేర్పండి' అని వుంది. ఈ లెటర్ చదవగానే థామస్ కన్నీళ్లు ఆపుకోలేక పోయాడు.

అప్పుడు థామస్‌కు.. తన తల్లి పడిన ఆవేదన, తనను మేధావి గా తీర్చి దిద్దడానికి ఆమె చేసిన కృషి, పడిన కష్టం గురించి స్పష్ట మైంది. తన తల్లి గనుక ఆ లెటర్‌లో ఉన్నది ఉన్నట్లు చదివి ఉంటే... తన బలహీనత తెలిసి పోయి, తాను ఇన్ని ఆవిష్కర ణలు చేసే అవకాశమే ఉండేది కాదని అనుకుంటూ ఉద్వేగ భరితంగా, ఎడిసన్ తన డైరీలో వెంటనే... " థామస్ ఎడిసన్ ఒక మానసిక వికలాంగుడైన అబ్బాయి. అతడిని మాతృ మూర్తి ఈ శతాబ్దానికే మేధావిగా మార్చింది" అని రాసు కున్నాడు.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

---

# వేములవాడలో వైభవంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

### బతుకమ్మ వేడుకలో పాల్గొన్న మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి, చల్మెడ లక్ష్మీనరసింహారావు దంపతులు



రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 17:(నేటినిజం ప్రతినిధి): ,తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలు వేములవాడ పట్టణంలో వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి తో పాటు బీఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు వారి సతీమణి సునీతతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించిన చల్మెడ దంపతులు మహిళలతో కలిసి బతుకమ్మ ఆటలు ఆడుతూ పండుగ సంబరాల్లో భాగస్వాములయ్యారు. వార్డుల్లోని కూడళ్ల వద్ద మహిళలను, స్థానిక ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వేములవాడలోని మూలవాగు వద్ద ఏర్పాటు చేసిన గౌరమ్మకు బతుకమ్మను సమర్పించి, సంప్రదాయబద్ధంగా నిమజ్జనం చేశారు. మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, పాటలు పాడుతూ గౌరమ్మను పూజించి నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు. దీంతో మూలవాగు పరిసరాల్లో పండుగ సందడి నెలకొంది. ఈ వేడుకలకు మాజీ డిప్యూటీ స్పీకర్, మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, ఉమ్మడి జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, రాజన్న సిరిసిల్ల జిల్లా మాజీ జడ్పీ చైర్‌పర్సన్ నేలకొండ అరుణ రాఘవరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవీరాజు, పట్టణ మహిళా కౌన్సిలర్లు వెంగళ అనిత శ్రీకాంత్ గౌడ్, వాసాల లావణ్య శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు, పట్టణ సీనియర్ నాయకులు యూత్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతుల కరెంటు కష్టాలపై బీఆర్ఎస్ గర్జన

**కాంగ్రెస్ పాలనలో రైతన్నకు విద్యుత్ కష్టాలు**

**24 గంటల ఉచిత విద్యుత్ అందించాల్సిందేపంటలు ఎండితే బాధ్యత ఎవరిది?**

**రైతుల కోసం బీఆర్ఎస్ పోరాటం ఉధృతం చేస్తాం**

**రైతులకు 24 గంటల విద్యుత్ అందించాలి- బీఆర్ఎస్ నేత చల్మెడ నరసింహారావు**




రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 17:(నేటినిజం ప్రతినిధి): రైతులకు 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించాలని, వ్యవసాయానికి విధిస్తున్న విద్యుత్ కోతలను తక్షణమే నిలిపివేయాలని బీఆర్ఎస్ నాయకుడు చల్మెడ నరసింహారావు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతులు విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు.

రైతులకు అండగా ఉంటామని చెప్పిన ప్రభుత్వం, వ్యవసాయానికి నిరంతర విద్యుత్ అందించడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తోందని ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు అందించిన 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరాను కొనసాగించాలని చల్మెడ కోరారు. వ్యవసాయ పనులకు విద్యుత్ అత్యంత అవసరమైన సమయంలో కోతలు విధిస్తే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాల వల్ల సాగునీరు అందక పంటలు దెబ్బతింటే రైతులు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వేములవాడ నియోజకవర్గంలో రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తక్షణమే స్పందించాలని చల్మెడ డిమాండ్ చేశారు. విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించి, రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రచారాలు, రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అన్నారు. నియోజకవర్గంలో విద్యుత్ కోతలకు గల కారణాలు, వ్యవసాయానికి ప్రస్తుతం ఎన్ని గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నారు, అంతరాయాలను నివారించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారనే వివరాలను ప్రభుత్వం వెల్లడించాలని చల్మెడ డిమాండ్ చేశారు. విద్యుత్ సరఫరాపై స్పష్టతనిస్తూ రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. రైతుల సమస్యలను ప్రభుత్వం తేలికగా తీసుకోవద్దని, విద్యుత్ కోతలను నిలిపివేసి 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించాలని చల్మెడ స్పష్టం చేశారు. రైతుల ఇబ్బందులు పరిష్కరించకపోతే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రైతుల హక్కులు, ప్రయోజనాల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందనీ తెలిపారు. ఈ ధర్నాలో నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, రామతీర్థపు రాజు, నిమ్మశెట్టి విజయ్, గూడూరి మధు, గోలి మహేష్, గోస్కుల రవి, వాసాల శ్రీనివాస్, సిరిగురి చందు, మ్యాకల రవి, బుర్ర బాబు, గూడూరి మధు, రఫిక్, శ్రీకాంత్ గౌడ్, చరణ్ రాజ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

### రైతులకు పంట మార్పిడిపై అవగాహన..లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కె. లక్ష్మీపతి గౌడ్

మహబూబ్‌నగర్, అక్టోబర్ 17: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని నారాయణపేట జిల్లా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కే లక్ష్మీపతి గౌడ్ అన్నారు. శనివారం నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల పరిధిలోని పెద్దజట్రంలో జిల్లా న్యాయ సేవ సంస్థ లీగల్ సర్వీసెస్ సంస్థ ఆధ్వర్యంలో లీగల్ సర్వీసెస్ సంస్థ సెక్రటరీ వింధ్య నాయక్ ఆదేశాల మేరకు చట్టాలపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ చట్టాలు రైతు సంక్షేమ పథకాలు రైతులకు ఉన్న చట్టపరమైన హక్కులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలు, వాటి పరిధి, ప్రయోజనాలు, పంటల బీమా, రైతుబంధు, రుణమాఫీ వంటి అంశాలపై వ్యవసాయ శాఖ అధికారులు వివరించారు. రైతులు ఎలాంటి మోసాలకు గురికాకుండా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బాల కార్మిక వ్యవస్థ,బాల్య వివాహాల నివారణ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన చట్టం, బాల్య వివాహాల నిషేధ చట్టం 2006 గురించి వివరించారు. 18 ఏళ్ల లోపు బాలికలకు, 21 ఏళ్ల లోపు బాలురకు వివాహం చేయడం చట్టరీత్యా నేరమని, అలా చేసిన వారికి 2 సంవత్సరాల జైలు శిక్ష లక్ష రూపాయల వరకు జరిమానా విధించబడుతుందని తెలిపారు. పంట మార్పిడి ఎందుకు అవసరంఅధికారుల నారాయణపేట జిల్లాలో వరి, పత్తి పంటలే ఎక్కువగా వేయడం వల్ల భూమి సారం దెబ్బతింటోందని, నీటి వనరులు తగ్గిపోతున్నాయని వ్యవసాయ విస్తరణ అధికారి స్వప్న తెలిపారు. పంట మార్పిడి వల్ల లాభాలుఒకే పంట వల్ల భూమిలోని పోషకాలు హరించుకుపోతాయి. పప్పు ధాన్యాలు, నూనె గింజలు వేయడం వల్ల భూమి బలపడుతుంది.నీటి పొదుపు: వరికి ఎక్కువ నీరు అవసరం. కందులు, మినుములు, పెసలు, వేరుశనగ, ఆవాలు వంటి పంటలకు తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి వస్తుంది.ఆదాయం పెరుగుదలమార్కెట్ లో డిమాండ్ ఉన్న పంటలు వేయడం వల్ల రైతుకు గిట్టుబాటు ధర లభిస్తుంది.

ఒక పంట నష్టపోయినా మరో పంట ఆదుకుంటుంది. ప్రభుత్వ ప్రోత్సాహం తెలంగాణ ప్రభుత్వం పంట మార్పిడి చేసే రైతులకు సబ్సిడీ విత్తనాలు, రైతుబంధు, రైతుబీమా, పంటల బీమా పథకాలు అందిస్తోంది. రైతులకు భూమి హక్కులు, కౌలు రైతు చట్టాలు, పంట నష్టపరిహారం పొందే హక్కు, నకిలీ విత్తనాలు, ఎరువులపై ఫిర్యాదు చేసే విధానం, వినియోగదారుల ఫోరం ద్వారా న్యాయం పొందే మార్గాలను తరపున న్యాయవాదులు వివరించారు. నకిలీ విత్తనాలు అమ్మిన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయవచ్చని తెలిపారు.రైతుబంధు, రైతుబీమా, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, పీఎం ఫసల్ బీమా యోజన, వ్యవసాయ యాంత్రీకరణ పథకం, ఆయిల్ పామ్ సాగు ప్రోత్సాహక పథకాల గురించి వివరించారు. చైల్డ్ డిపార్ట్మెంట్ తిరుపతయ్య మాట్లాడుతూ అక్షరాస్యత చట్టపరమైన అవగాహన ముఖ్యంగా, సమాజంలోని బలహీన వర్గాలకు హక్కులు, బాల్యవివాహాలు, బాలకార్మిక చట్టాలు అవగాహన కలిగి ఉండాలన్నారు. పిల్లలకు చిన్నవయస్సులో పెళ్లిళ్లు చేస్తే పెద్దవారిదే తప్పుగా తల్లిదండ్రుల నిర్వహణ, స్త్రీ పురుష ఆధిక్యత, మహిళలకు రక్షణ చట్టం ఉన్నదని నిత్యవసర సరుకుల చట్టం ద్వారా ప్రతి ఒక్క వ్యక్తి తమ యొక్క రసీదులను జాగ్రత్తపరచుకొని నష్టం నీకు వారిని ఎదుర్కోకుండా తమను తాను కాపాడుకోవాలని తెలిపారు. వరకట్న వేదింపులు, సఖి సెంటర్, వోల్డిగే హోమ్, గవర్నమెంట్ నుంచి వచ్చే బెనిఫిట్స్ ప్రయోజనాలపై అవగాహన మరియు లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ చట్టం న్యాయపరమైన రక్షణ, చట్టపరమైన అవగాహన రేషన్ కార్డు, బర్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు గురించి వివరించారు. న్యాయపరమైన రక్షణ, చట్టపరమైన అవగాహన, ఉచిత న్యాయ సహాయం ఎలా పొందాలి, అమలు వంటివి న్యాయ సేవా సంస్థ చట్టాలపై ఉచిత న్యాయ సహాయం ఎలా పొందాలి అమలు వంటివి, న్యాయ సలహాల కోసం 15100 నెంబర్ కు ఫోన్ చేసి తమ సమస్యను చెప్తే ఈ సంస్థలో పరిష్కారం చూపడం జరుగుతుందని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పెద్ద జట్రం సర్పంచ్ వాకిటి వెంకటేష్, చైల్డ్ డిపార్ట్మెంట్ తిరుపతయ్య, ఊట్కూర్ ఏఎస్ఐ సంజీవయ్య వ్యవసాయ విస్తరణ అధికారి స్వప్న పంచాయతీ కార్యదర్శి భవిత, గ్రామ పెద్దలు, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

# మూలవాగు తీరాన పూల సందడి!

**వేములవాడలో అంబరాన్నంటిన సద్దుల సంబురం**

**పుట్టింటికి చేరిన ఆడపడుచులు.. పాటలు, కోలాటాలతో కోలాహలం**

**వేడుకల్లో విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గీతే**

**రూ.34 లక్షలతో ఏర్పాట్లు.. పటిష్ఠ బందోబస్తుతో వేడుకలకు ముగింపు**





రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 17:(నేటినిజం ప్రతినిధి): పూల సోయగాలు.. జానపద గీతాల హోరు.. కోలాటాల సందడి.. ఆడపడుచుల ఆనందోత్సాహాల నడుమ వేములవాడలో సద్దుల బతుకమ్మ వేడుకలు శుక్రవారం వైభవంగా జరిగాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పూల పండుగతో రాజన్న క్షేత్రం పులకించింది. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలతో మూలవాగు తీరం కనువిందు చేసింది. వేములవాడలో ఏడు రోజులకే సద్దుల బతుకమ్మ నిర్వహించడం ఆనవాయితీ కావడంతో అత్తారిళ్లలో ఉన్న ఆడపడుచులు పుట్టింటికి చేరుకుని కుటుంబ సభ్యులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. ఉదయం నుంచే మహిళలు తంగేడు, గునుగు, చామంతి తదితర పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి పూజలు నిర్వహించారు. సాయంత్రం బతుకమ్మలను చేతబట్టి మూలవాగు వద్దకు చేరుకుని వాటి చుట్టూ తిరుగుతూ సంప్రదాయ పాటలు పాడారు. యువతుల కోలాటాలు, కళాకారుల ప్రదర్శనలు పండుగకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఒగ్గుడోలు దరువులు, బోనాల ప్రదర్శనలతో వేడుకల ప్రాంగణం సందడిగా మారింది. అమ్మవారి శోభాయాత్రలో ఎమ్మెల్యే ప్రత్యేకత మున్సిపల్ కార్యాలయం నుంచి మూలవాగు వరకు గౌరీదేవి అమ్మవారి విగ్రహ శోభాయాత్ర కనులపండువగా సాగింది. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వయంగా వాహనం నడుపుతూ విగ్రహాన్ని మూలవాగు వద్దకు తీసుకెళ్లారు. అనంతరం అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. భక్తిశ్రద్ధల మధ్య సాగిన ఈ కార్యక్రమం వేడుకలకు ఆధ్యాత్మిక శోభను తీసుకొచ్చింది. ఆటపాటల్లో అధికారుల సందడి మూలవాగు వద్ద జరిగిన వేడుకల్లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి. గితే పాల్గొన్నారు. మహిళలతో కలిసి బతుకమ్మ, దాండియా ఆటల్లో పాల్గొని సందడి చేశారు. ప్రజా కళాకారిణి విమలక్క మహిళలతో కలిసి బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహం నింపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. రూ.34 లక్షలతో పండుగ ఏర్పాట్లు సద్దుల బతుకమ్మ వేడుకల కోసం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సుమారు రూ.34 లక్షలతో ఏర్పాట్లు చేపట్టారు. రహదారుల వెంట ఎల్‌ఈడీ లైట్లు, విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసి వేడుకల ప్రాంతాన్ని అలంకరించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు అవసరమైన చర్యలు తీసుకున్నారు. బందోబస్తుతో సాఫీగా ముగింపు వేడుకలకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావడంతో ట్రాఫిక్ సమస్యలు, అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తు నిర్వహించారు. ఎస్పీ మహేష్ బి. గితే పర్యవేక్షణలో డీఎస్పీ శ్రీనివాస్, పట్టణ సీఐ వీరప్రసాద్ ఆధ్వర్యంలో భద్రతా చర్యలు చేపట్టారు. చివరగా మహిళలు బతుకమ్మలను మూలవాగులో నిమజ్జనం చేసి గౌరమ్మకు వీడ్కోలు పలికారు. దీంతో వేములవాడలో సద్దుల బతుకమ్మ వేడుకలు ప్రశాంతంగా ముగిశాయి

ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రతాప రామకృష్ణ, టీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చెలిమెడ నరసింహారావు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వికాస్ రావు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, పొలాస నరేందర్, రామతీర్థపు రాజు, ప్రజాప్రతినిధులు, మహిళలు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

# షోయబ్ ఉల్లా ఖాన్ జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి..

**బిజెపి మైనార్టీ మోర్చా రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎం డి. ముజీబ్**




కరీంనగర్, అక్టోబర్ 17:(నేటినిజం ప్రతినిధి): కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయంలో శనివారం రోజున బిజెపి మైనార్టీ మోర్చా మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్ ఆధ్వర్యంలో ప్రముఖ పాత్రికేయుడు, అమరవీరుడు షోయబ్ ఉల్లా ఖాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి మైనార్టీ మోర్చా మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్ షోయబ్ ఉల్లా ఖాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తన కలాన్నే ఆయుధంగా చేసుకుని అక్షర పోరాటం చేసిన ధైర్యశాలి, మహనీయుడు షోయబ్ ఉల్లా ఖాన్ అని కొనియాడారు. ప్రజల స్వేచ్ఛ, హక్కుల కోసం తన ప్రాణాలను సైతం త్యాగం చేసిన ఆయన పోరాట పటిమ నేటి తరానికి ఎంతో ఆదర్శనీయమని పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వీరుడు , నిర్భయ జర్నలిస్ట్ షోయబుల్లాఖాన్ జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, మైనార్టీ మోర్చా ప్రతినిధులు,సమీయుల్లా అహ్మద్, మొహమ్మద్ సైద్, అబూబకర్, ఫయాజ్ చిస్తి, సర్దార్, మహమ్మద్ ఆతీఫ్, అమీర్, రౌఫ్ తదితరులు కార్యకర్తలు పాల్గొని అమరవీరుడు షోయబ్ ఉల్లా ఖాన్ సేవలను గుర్తుచేసుకున్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93.
E-mail :netinijam93@gmail.com.